


# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక

ప్రశ్నించడం మన హక్కు




సంపుటి : 1 సంచిక : 93 పేజీలు : 8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) పచురణ : డాక్టర్ బి.ఆర్. అంబెద్కర్ కోనసీమ జిల్లా శుక్రవారం 13 ఫిబ్రవరి 2026 వెల : 1/-రూ ॥

VOLUME :1 ISSUE : 93 PAGES : 8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : Dr. B.R. AMBEDKAR KONASEMA DIST FRI 13 FEBRUARY 2026 PRICE : 1/- RS

Simultaneously Published form Dr. B.R. Ambedkar Konasema Dist, Narasarao Peta,Bapatla,Visakhapatnam,Kakinada,Ongole, Kadapa,Thadepalligudem,SPSR Nellore, Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari, Eluru,Guntur, Tirupati,Chittor,Kurnool,Anantapur



## మండలిలో మాటల యుద్ధం..

### బొత్స, మంత్రి పార్ధసారథి మధ్య సవాళ్లు, ప్రతిసవాళ్లు!

- ఏపీ శాసనమండలిలో సంక్షేమ పథకాలపై తీవ్ర వాగ్వాదం
- ప్రభుత్వ వాదనలు అబద్ధమని, నిరూపిస్తే క్షమాపణ చెబుతానని బొత్స సవాల్
- బొత్స సవాల్‌ను స్వీకరిస్తున్నామని, ఏ శిక్షకైనా సిద్ధమని మంత్రి పార్ధసారథి ప్రతిసవాల్
- అన్నదాత సుఖీభవ, తల్లికి వందనం పథకాలపై ఇరుపక్షాల మధ్య మాటల యుద్ధం
- పింఛన్ల తొలగింపు ఆరోపణలపై వివరణ ఇచ్చిన మంత్రి కొండపల్లి శ్రీనివాస్

పెన్ పవర్ డెస్క్:ఆంధ్రప్రదేశ్ శాసనమండలి సమావేశాలు గురువారం అధికార, విపక్ష సభ్యుల మధ్య తీవ్ర వాగ్వాదాలతో దద్దరిల్లాయి. సంక్షేమ పథకాల అమలుపై వైసీపీ, టీడీపీ నేతల మధ్య మాటల యుద్ధం తారస్థాయికి చేరింది. ముఖ్యంగా వైసీపీ పక్ష నేత బొత్స సత్యనారాయణ, గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్ధసారథి మధ్య సవాళ్లు, ప్రతిసవాళ్లతో సభా వాతావరణం వేడెక్కింది. గవర్నర్ ప్రసంగంలో పేర్కొన్న 'అన్నదాత సుఖీభవ' పథకం కింద రూ.20,000 ఇచ్చినట్లు చెప్పడం పూర్తిగా అవాస్తవమని బొత్స సత్యనారాయణ ఆరోపించారు. ప్రభుత్వం చెప్పింది నిజమని నిరూపిస్తే తాను బహిరంగంగా క్షమాపణ చెప్పడానికి సిద్ధమని సవాల్ విసిరారు. ఇదే క్రమంలో 'వసతి దీవెన' నిధులు ఇప్పటికీ విడుదల కాలేదని, ప్రైవేటు ఆసుపత్రులు 'ఆరోగ్యశ్రీ'ని నిరాకరిస్తున్నాయని, 'తల్లికి వందనం' సక్రమంగా అందడం లేదని విమర్శించారు. "మేం సభను తప్పుదోవ పట్టించడం లేదు.

- మిగతా2లో

## ఒక కప్పు టీ కంటే ఎక్కువ తీసుకున్నట్టు

# నిరూపిస్తే ఏ చర్యకైనా సిద్ధం

- పరిశ్రమలకు భూ కేటాయింపులపై శాసనమండలిలో వాడీవేడి చర్చ
- విశ్వసనీయత ఉన్న 5 కంపెనీలకే 99 పైసలకు భూములిచ్చామన్న మంత్రి లోకేశ్
- విశాఖలో 5 లక్షల ఐటీ ఉద్యోగాల కల్పనే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టీకరణ
- ఆరోపణలు చేసి పారిపోవడం సరికాదని వైసీపీకి హితవు
- పారిశ్రామికవేత్తల నుంచి కప్ టీ, కేక్ తప్ప ఏమీ తీసుకోలేదని వెల్లడి



పెన్ పవర్ డెస్క్:"నాపై విమర్శలు చేయాలనుకుంటే ఒక్క విషయంలో చేయవచ్చు. టాటా సన్స్ ఛైర్మన్‌ను కలిసినప్పుడు ఆయన బాంబే హౌస్‌లో ఒక కప్పు టీ ఇచ్చారు. దావోస్‌లో నా పుట్టినరోజున కాగ్నిజెంట్ వారు ఒక కేక్ ఇచ్చారు. అంతకుమించి మేం లాలూచీ పడాల్సిన అవసరం లేదు. ఒక కప్పు టీ కంటే నేను వారి వద్ద ఎక్కువ తీసుకున్నట్లు నిరూపిస్తే ఏ చర్యకైనా సిద్ధం" అని రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ వైసీపీకి సవాల్ విసిరారు. పరిశ్రమలకు భూముల కేటాయింపుల్లో ఎలాంటి అవినీతికి తావులేదని, తమ ప్రభుత్వ ఏకైక లక్ష్యం యువతకు ఉద్యోగాలు కల్పించడమేనని ఆయన స్పష్టం చేశారు. శాసనమండలిలో వైసీపీ సభ్యుల ఆరోపణలకు ఆయన ఈ విధంగా ధీటుగా బదులిచ్చారు.

**మండలిలో భూ కేటాయింపులపై వాడీవేడి చర్చ**

శాసనమండలి ప్రశ్నోత్తరాల సమయంలో పరిశ్రమలకు 99 పైసలకే భూముల కేటాయింపు అంశంపై వాడీవేడి చర్చ జరిగింది. గత 20 నెలల్లో ప్రభుత్వం కేటాయించిన భూములు, కుదుర్చుకున్న ఒప్పందాలు (ఎంవోయూలు), వాటి ధరల వివరాలపై వైసీపీ సభ్యులు తూమాటి మాధవరావు, వరుదు కల్యాణి, పండుల రవీంద్రబాబు ప్రశ్నలు లేవనెత్తారు. విశాఖలో కోట్ల రూపాయల విలువైన భూములను ప్రైవేటు సంస్థలకు, రియల్ ఎస్టేట్ కంపెనీలకు 99 పైసలకే ఎలా ఇస్తారని వైసీపీ పక్ష నేత బొత్స సత్యనారాయణ ప్రశ్నించారు. ఈ ఆరోపణలపై మంత్రి లోకేశ్ సమగ్రంగా సమాధానమిచ్చారు.

**విశ్వసనీయత ఉన్న 5 కంపెనీలకే 99 పైసలకు భూమి**

- మిగతా2లో



## పార్టీ లైన్ దాటితే చూస్తూ ఊరుకోబోం..

### కొలికపూడికి పల్లా వార్నింగ్

- తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి వ్యవహారశైలిపై విమర్శలు
- అసెంబ్లీ లాబీలో కొలికపూడితో మాట్లాడిన పల్లా శ్రీనివాస్
- పార్టీతోనే గుర్తింపు, వ్యక్తిగతంగా జీరో అని గుర్తించాలంటూ హితవు

పెన్ పవర్ డెస్క్:తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాస్ వ్యవహారశైలిపై ఇటీవల విమర్శలు వస్తుండడంతో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్ తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. అసెంబ్లీ లాబీలో కొలికపూడితో పల్లా సమావేశమయ్యారు.

- మిగతా2లో

## రాహుల్ గాంధీ లోక్ సభ సభ్యత్వాన్ని రద్దు చేయాలి..

### సభలో ఎంపీ నోటీసు

- అమెరికాతో భారత్ ట్రేడ్ డీల్ పై రాహుల్ ఆరోపణలు
- నరవణె బుక్ పై మాట్లాడకుండా అడ్డుకుంటోందని ప్రభుత్వంపై విమర్శలు
- దేశాన్ని అమ్మేశారన్న రాహుల్ వ్యాఖ్యలపై బీజేపీ ఎంపీల ఆగ్రహం

- మిగతా2లో



## 85% కంటిచూపు కోల్పోయిన ఇమ్రాన్ ఖాన్

పెన్ పవర్ డెస్క్:పలు కేసుల్లో జైలు శిక్ష అనుభవిస్తున్న పాకిస్థాన్ మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్ ఆరోగ్య పరిస్థితి ఇటీవల చర్చనీయాంశమైన సంగతి తెలిసిందే. అయితే, రావల్పిండిలోని జైల్లో ఉన్న ఆయన పట్ల అక్కడి

- మిగతా2లో





## అడవుల్లోని గిరిజన గ్రామాలకు 'సంజీవని' డ్రోన్లు.. ఏపీలో సరికొత్త వైద్య సేవలు!

- సరైన రవాణా సదుపాయం లేని గ్రామాలకు ప్రాణదాతలుగా డ్రోన్లు
- 20 నిమిషాల్లోపే అత్యవసర మందుల సరఫరా
- రెడ్ వింగ్ సంస్థతో కలిసి ఏపీ ప్రభుత్వం సరికొత్త సేవలు

పెన్ పవర్ డెస్క్:గిరిజన ప్రాంతాల్లోని పేదలకు ఆధునిక వైద్య సేవలను చేరువ చేసే దిశగా సరికొత్త సాంకేతిక విప్లవానికి ఏపీ ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. 'సంజీవని' మెడికల్

- మిగతా2లో

## తిరుపతి లడ్డూ నెయ్యి: చంద్రబాబుపై

# భూమన ఆరోపణలు

- తిరుపతి లడ్డూ నెయ్యి సరఫరాపై సీఎం చంద్రబాబును ప్రశ్నించిన భూమన
- గతంలో హెరిటేజ్ సంస్థ రూ. 278కే నెయ్యి సరఫరా చేసిందని వెల్లడి
- ఇప్పుడు అదే సంస్థ రూ. 658కి సరఫరా చేయడంపై తీవ్ర ఆరోపణలు
- ధరల వ్యత్యాసం, నాణ్యతపై చంద్రబాబు సమాధానం చెప్పాలని డిమాండ్

పెన్ పవర్ డెస్క్:తిరుపతి లడ్డూ ప్రసాదం తయారీకి ఉపయోగించే నెయ్యి ధర, నాణ్యత విషయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు రెండు నాల్కల ధోరణి అవలంబిస్తున్నారని వైసీపీ తీవ్రంగా విమర్శించింది. టీటీడీ మాజీ ఛైర్మన్, వైసీపీ నేత భూమన కరుణాకర్ రెడ్డి గురువారం మీడియాతో మాట్లాడుతూ ఈ ఆరోపణలు చేశారు. గతంలో 2014-19 మధ్య చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు, ఆయన కుటుంబానికి చెందిన హెరిటేజ్ ఫుడ్స్ తయారీ యూనిట్ అయిన ఇందాపూర్ ఫుడ్స్ అండ్



- మిగతా2లో


# కాకాణికి నోటీసులు జారీ చేసిన పోలీసులు

- బాలిక మృతిపై నిరాధార ఆరోపణలు చేశారని కేసు నమోదు
- ఈ నెల 14న విచారణకు రావాలని నోటీసులు ఇచ్చిన కోవూరు పోలీసులు
- మైనింగ్ కేసులో ఇప్పటికే బెయిల్ పై బయట ఉన్న కాకాణి

పెన్ పవర్ డెస్క్:గత కొన్ని రోజులుగా వైసీపీ నేతలకు వరుస ఎదురుదెబ్బలు తగులుతున్నాయి. మాజీ మంత్రులు అంబటి రాంబాబు, జోగి రమేశ్ ల అరెస్టులు, రిమాండ్లు అందరికీ తెలిసిందే. ఇప్పుడు మరో మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి వంతు వచ్చింది.

- మిగతా2లో





## విద్యార్థులకు మూడవ తరగతి నుంచి

# అందుబాటులోకి 'ఏఐ'

- విద్య సహా అన్ని రంగాల్లో ఏఐ విస్తరిస్తోందన్న కేంద్ర మంత్రి
- పరిశోధనలు నిర్వహించే విద్యార్థులు వరకు ఏఐని అందుబాటులోకి తెస్తామన్న మంత్రి
- కృత్రిమ మేధ రంగంలో భారత్ అభివృద్ధి చెందుతోందన్న ధర్మేంద్ర ప్రధాన్

కృత్రిమ మేధస్సు (ఏఐ) విధానాన్ని భారతదేశంలోని విద్యార్థులందరికీ చేరువ చేస్తామని కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెల్లడించారు. ప్రపంచవ్యాప్తంగా విద్య సహా అన్ని రంగాల్లో ఏఐ విస్తరిస్తోందని అన్నారు. దేశంలో 30 కోట్ల మంది విద్యార్థులు ఉన్నారని, 3వ తరగతి విద్యార్థుల నుంచి ఆధునాతన పరిశోధనలు నిర్వహించే విద్యార్థుల వరకు కృత్రిమ మేధను అందుబాటులోకి తీసుకువస్తామని అన్నారు.ఢిల్లీలో జరిగిన ఏఐ-కాంక్లేవ్-2026 సదస్సులో పాల్గొన్న ధర్మేంద్ర ప్రధాన్ మాట్లాడుతూ, కృత్రిమ మేధ రంగంలో భారత్ అభివృద్ధి చెందుతోందని అన్నారు. మన వద్ద మేధో సామర్థ్యానికి లోటు లేదన్నారు. కృత్రిమ మేధకు సంబంధించి పలు పరిశోధనలు జరుగుతున్నట్లు తెలిపారు. ఏఐకి సంబంధించిన పరిశోధనలు, కొత్త ఆవిష్కరణలను సృష్టించడంలో సాంకేతిక సంస్థలు నిమగ్నమయ్యాయని అన్నారు.

## ఢిల్లీలో రేవంత్ రెడ్డి బిజీబిజీ..

### కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడుతో భేటీ

- వివిధ విమానాశ్రయాల అభివృద్ధి పనులకు సంబంధించి చర్చ
- మామునూరు విమానాశ్రయానికి భూసేకరణ ప్రక్రియ పూర్తయినట్లు వెల్లడి
- రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌ను కలిసిన ముఖ్యమంత్రి

పెన్ పవర్ డెస్క్:దేశ రాజధాని ఢిల్లీలో ఉన్న తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బిజీబిజీగా గడుపుతున్నారు. ఈరోజు ఆయన కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడుతో భేటీ అయ్యారు. రాష్ట్రంలోని



- మిగతా2లో

## ఎడిటర్ వ్యూ

# కార్యకర్తలను విస్మరిస్తున్న పార్టీలు

రాజకీయ పార్టీల మనుగడ వెనుక ఆ పార్టీ కార్యకర్తల శ్రమ, త్యాగం ఆధారారపడి ఉన్నాయనేది నిర్వివాద అంశం. అదే రాజకీయ పార్టీలు ఇటీవలి కాలంలో కార్యకర్తలపట్ల అనుసరిస్తున్న వైఖరి అవకాశవాదాన్ని బట్టబయలు చేస్తూ ఉండడం గమనార్హం. ముఖ్యంగా ఈ పరిణామం ప్రాంతీయ పార్టీలలో నూటికి నూరు శాతం కనిపిస్తూ ఉంది. ఉభయ తెలుగు రాష్ట్రాలలోని రాజకీయాలు క్షుణ్ణంగా పరిశీలిస్తే ఈ విషయం సామాన్య మానవునికి సైతం సులభంగా అర్థమవుతుంది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో తెలుగుదేశం, వైయస్ఆర్, కాంగ్రెస్, జనసేన పార్టీలు, తెలంగాణ రాష్ట్రంలో భారత రాష్ట్ర సమితి పార్టీ ప్రధానంగా ప్రాంతీయ పార్టీలుగా మనుగడ సాగిస్తున్నాయి. 1982లో ఆవిర్భవించిన తెలుగుదేశం పార్టీ 22 సంవత్సరాల 302 రోజులు, 2001లో ఆవిర్భవించిన తెలంగాణ (భారత) రాష్ట్ర సమితి పార్టీ 9 సంవత్సరాల 187 రోజులు, 2011 లో ఆవిర్భవించిన వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ 5 సంవత్సరాలు అధికారం అనుభవించాయి. 2014లో ఆవిర్భవించిన జనసేన పార్టీ ఆంధ్రప్రదేశ్‌లో గత 17 నెలలనుంచి ప్రధాన భాగస్వామిగా అధికారంలో ఉంది. ఆంధ్రప్రదేశ్‌లో తెలుగుదేశం, జనసేన పార్టీల కూటమి ఇంకా 3 సంవత్సరాలకు పైగా కచ్చితంగా అధికారంలో ఉంటాయి. కార్యకర్తల సమయం, డబ్బు, కుటుంబాల త్యాగ ఫలితంగానే ఈ విధంగా ప్రాంతీయ పార్టీలు అధికారాన్ని అనుభవిస్తూ సుదీర్ఘ కాలంనుంచి మనుగడ సాగిస్తున్నాయనడంలో ఎటువంటి సందేహం లేదు. కానీ కార్యకర్తలు చనిపోయినప్పుడు సంబంధిత కుటుంబానికి పార్టీ తరపున ఇన్సూరెన్సు చెక్, కార్యకర్తకు లేదా వారి కుటుంబంలో ఎవరికైనా అనారోగ్యం కలిగితే వారికి సిఎం రిలీఫ్ ఫండ్ తప్ప కార్యకర్తలకు ఇతర లబ్ధి చేకూరుతున్నట్లు ఏమీ కనిపించడం లేదు. వాస్తవంగా రాజకీయ చదరంగంలో పావులుగామారి చురుకుగా ఉండే కార్యకర్తలు అనేక మంది కేసుల్లో ఇరుక్కుంటున్నారు. వారిని పట్టించుకునే నాథుడే లేక వారు అష్టకష్టాలు అనుభవిస్తున్నారు. మరి కొంతమంది ప్రాణాలు కూడా కోల్పోతున్నారు. రాజకీయ వైరంలో ప్రాణాలు కోల్పోయిన కార్యకర్త కుటుంబ సభ్యులను సంబంధిత పార్టీ స్థానిక నాయకులు కలిసి తాత్కాలిక ఖర్చులకు కొద్దిగా డబ్బులు ఆ కుటుంబానికి ఇచ్చి పార్టీ మీకు అండగా ఉంటుందని సమయానుకూల హామీలు గుప్పిస్తారు. తరువాత ఎవరి దారి వారిదే. ప్రాణాలు కోల్పోయిన కార్యకర్తల కుటుంబాలు మాత్రం రోడ్లపాలే. కార్యకర్తలు తమ పార్టీలను అధికారంలోకి తీసుకువచ్చేందుకు ప్రాణాలు సైతం పణంగా పెడుతున్నారు.

కానీ రాజకీయ పార్టీలు అందుకు పూర్తి విరుద్ధంగా వ్యవహరిస్తూ ఉండడం గమనార్హం. అధికారంలో లేనప్పుడు కుటుంబ సభ్యులుగా, అధికారంలో ఉన్నప్పుడు అంటరానివారుగా చూస్తూ కార్యకర్తల జీవితాలతో రాజకీయ పార్టీలు ఆడుకుంటున్నాయని కచ్చితంగా చెప్పవచ్చు. ఈ పరిణామం అన్ని ప్రాంతీయ పార్టీలలో కనిపిస్తూ ఉంది. ప్రాంతీయ పార్టీలు అన్నీ వ్యక్తిగత పార్టీలు. అందువలన ఆ పార్టీలన్నీ వాటి అధినేతలైన ఏక వ్యక్తి నిర్ణయాలపైన ఆధారపడి వ్యవహారాలు నడిపిస్తూ ఉంటాయి. గత కొద్ది కాలంగా ఈ పార్టీలలో సిద్ధాంతాలు, విలువలు ఏమీ కనిపించడం లేదు. అధికారమే ధ్యేయంగా పార్టీలు రాజకీయ కార్యకలాపాలు నిర్వహిస్తూ ఉండడం గమనార్హం. అధికారం లేనప్పుడు క్షేత్రస్థాయిలో అంకితభావంతో కష్టపడి పార్టీకి పని చేసిన వారికే టికెట్లు ఇస్తామని కార్యకర్తలకు, పార్టీ నాయకులకు పార్టీల అధిష్టానం తెలియచేస్తూ ఉంటుంది. పార్టీల అధిష్టానం మాటలను నమ్మి కార్యకర్తలు, నాయకులు ఇల్లూ, వళ్ళూ గుల్ల చేసుకుని పార్టీకి కష్టపడుతూ ఉంటారు. కానీ ఎన్నికలు సమీపిస్తున్న కొద్దీ గెలుపు గుర్రాలకే టికెట్లు అంటూ పార్టీల అధిష్టానం స్వరంలో మార్పు కనిపిస్తూ ఉండడం నిత్యకృత్యంగా మారింది. అందుకు డబ్బు, కులం, పరపతి కలిగిన వ్యక్తులను ఎక్కడెక్కడినుంచో తెచ్చుకుని వారికి ఎంఎల్ఎ, ఎం.పి. టికెట్లు కేటాయిస్తున్నారు.

మరికొన్ని పార్టీలైతే అప్పటి వరకు తమ పార్టీ కార్యకర్తలను అనేక ఇబ్బందులకు గురిచేసిన ప్రత్యర్థి పార్టీ నాయకులను స్థానిక కార్యకర్తలు, నాయకుల అభీష్టానికి వ్యతిరేకంగా పార్టీలో చేర్చుకుని వారికి టికెట్లు ఇస్తూ ఉన్నాయి. అయినా అధికారం కోసం కార్యకర్తలు, నాయకులు అధినేత నిర్ణయాన్ని గౌరవించి తమ అభ్యర్థి విజయానికి కష్టపడుతున్నారు. అధికారం లభించాకయినా రాజకీయ పార్టీలు కార్యకర్తలకు న్యాయం చేస్తున్నాయా? అంటే అదీ లేదు. అధికారం లభించాక డబ్బు, కులం, పరపతి అవసరంలేని శాసనసభ్యుల కోటాలో, గవర్నర్ కోటాలో శాసనమండలి స్థానాలు, రాజ్యసభ స్థానాలు ప్రతి పార్టీకీ అనేకం లభిస్తాయి. క్షేత్రస్థాయిలో పార్టీ కోసం కష్టపడే కార్యకర్తలను నాయకులుగా తయారుచేసి వారికి న్యాయం చేయాలని ఈ ప్రాంతీయ పార్టీలకు నిజంగా ఉంటే ఈ పదవులు వారికి ఇవ్వవచ్చు. కానీ ఇప్పటి వరకు ఏ పార్టీ అయినా సామాన్య కార్యకర్తకు ఎంఎల్ఎ కోటా, గవర్నర్ కోటాలోని శాసనమండలిలో స్థానం లేదా రాజ్యసభలో స్థానం కల్పించాయా? కనీసం నామినేటెడ్ పదవులలో కూడా క్షేత్ర స్థాయిలో కష్టపడి పనిచేసే కార్యకర్తలకు ఏ పార్టీ న్యాయం చేయడం లేదు అని కచ్చితంగా చెప్పవచ్చు. ఇటీవలి కాలంలో గ్రామస్థాయి నాయకునికి రాష్ట్ర స్థాయి పదవులు, ఎంఎల్ఎ స్థాయి, రాష్ట్ర స్థాయి నాయకునికి చిన్న, చిన్న డైరెక్టర్ పదవులు కేటాయించడం అన్ని పార్టీలలో కనిపిస్తూ ఉంది.

ఈ పరిణామాలు ఎందుకు జరుగుతున్నాయో? ఆ పార్టీల అధిష్టానానికే తెలియాలి. సాంకేతికత, సలహాదారులపై ఎక్కువగా ఆధారపడుతూ ఉండడంతో పార్టీల అధినేతలకు, క్షేత్రస్థాయిలో పార్టీకి చిత్తశుద్ధితో పనిచేసే కార్యకర్తకు మధ్య తీవ్ర అగాధం ఏర్పడింది అనడం ఎటువంటి సందేహం లేదు. కార్యకర్తలతో సమావేశమై వారిని స్వేచ్ఛగా మాట్లాడనిచ్చే పరిస్థితి ఏ అధినేత చేయడం లేదు. కార్యకర్తను స్వేచ్ఛగా మాట్లాడనిస్తేనే కదా పార్టీ లోటుపాట్లు అధినేతకు తెలిసేది. కార్యకర్త దగ్గర తాము చేసే తప్పులను చెప్పించుకునేందుకు ఏ పార్టీ అధినేత సాహసించడం లేదు. తాము చెప్పిందే కార్యకర్తలు వినాలి అనే ధోరణితో ప్రతి పార్టీ అధినేత వ్యవహరిస్తూ ఉన్నారు. ఒకవేళ ఏ కార్యకర్త అయినా అధినేతలు చేసే తప్పులు ఎత్తిచూపితే ఆ కార్యకర్త బతుకు బస్టాండే. తన తప్పులు ఎత్తిచూపిన కార్యకర్త దశాబ్దాలు పాటూ పార్టీ కోసం కష్టపడినా పట్టించుకోకుండా వారిని డస్ట్‌బిన్‌లో వేసేసే పరిస్థితి ప్రతి పార్టీలో కనిపిస్తూ ఉంది. పార్టీల అధినేతలందరూ పార్టీ సమావేశాల్లో కూడా తమను వ్యక్తిగతంగా పొగిడించుకునేందుకే ప్రాధాన్యత ఇస్తున్నారు. అదే విధంగా క్షేత్రస్థాయిలో అష్టకష్టాలు అనుభవిస్తూ పార్టీకి కష్టపడి పనిచేసే కార్యకర్తను మించి సోషల్ మీడియాలో ప్రత్యర్థులపై పోస్టులు పెట్టే వారికి, ప్రత్యర్థి పార్టీల నేతలను తిట్టే వారికి, భజనపరులకు ఇటీవల అన్ని పార్టీలు అత్యధిక ప్రాధాన్యత ఇస్తూ ఉండడం స్పష్టంగా కనిపిస్తూ ఉంది. పార్టీలు చేసే మంచి పనులను గ్రామస్థాయిలో ప్రజలకు తెలియచేసేది. అధినేతలు ఇచ్చే అలివికాని హామీలను క్షేత్రస్థాయిలో ఇంటింటికీ తీసుకుపోయేది, అధినేతలు ప్రత్యర్థి పార్టీలపై రాజకీయ అవసరాల కోసం చేసే విమర్శలకు క్షేత్రస్థాయిలో అండగా నిలబడేది కార్యకర్తలే. అటువంటి నిజమైన కార్యకర్తలను విస్మరిస్తున్నందు వలనే తెలుగు రాష్ట్రాలలో ప్రాంతీయ పార్టీలు సుదీర్ఘ కాలం పాటు వరుసగా అధికారంలో ఉండలేకున్నాయి అనేది నిర్వివాదాంశం.

# ఒక కప్పు టీ కంటే ఎక్కువ తీసుకున్నట్టు నిరూపిస్తే ఏ చర్యకైనా సిద్ధం

- మొదటి పేజి తరువాయి

రాష్ట్రంలో కేవలం ఐదు విశ్వసనీయమైన (క్రెడిబులిటీ) కంపెనీలకే 99 పైసలకు భూములు కేటాయించినట్లు మంత్రి లోకేశ్ తెలిపారు. టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (ఒజూ), కాగ్నిజెంట్, ఏఎన్ఎస్ఆర్ గ్లోబల్, రహేజా, మదర్సన్ ఇంటర్నేషనల్ కంపెనీలకు మాత్రమే ఈ ధరకు భూములు ఇచ్చామన్నారు. ఈ ఐదు కంపెనీల ద్వారా రాష్ట్రంలో సుమారు 65,000 మందికి ప్రత్యక్షంగా ఉద్యోగాలు రానున్నాయని వివరించారు. ఉదాహరణకు, కాగ్నిజెంట్ మొదట 8,000 ఉద్యోగాలు కల్పిస్తామని చెప్పి, భూమిపూజ సమయంలో ఆ సంఖ్యను 25,000కు పెంచిందని గుర్తుచేశారు.

**ఏపీకి పరిశ్రమలు రాకూడదన్నదే వైసీపీ లక్ష్యం**

వైసీపీ తీరుపై మంత్రి లోకేశ్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఏపీకి పరిశ్రమలు రాకూడదని, పెట్టుబడులను తరిమేయాలనే ఏకైక లక్ష్యంతో వైసీపీ పనిచేస్తోందని ఆరోపించారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో ఆర్థిక ఉగ్రవాదం నడిచిందని, అమర్ రాజా వంటి సంస్థను రాష్ట్రం నుంచి తరిమేశారని విమర్శించారు. తాము 17 నెలల్లోనే ఆర్సెలర్ మిట్టల్ వంటి ప్రతిష్ఠాత్మక సంస్థను రాష్ట్రానికి తీసుకొచ్చామని, దేశంలోనే అతిపెద్ద స్టీల్ ప్లాంట్ ఉత్తరాంధ్రలో రాబోతోందని చెప్పారు. వాస్తవాలు తెలుసుకోకుండా వైసీపీ సభ్యులు సభను తప్పుదోవ పట్టిస్తున్నారని అన్నారు.

**హైదరాబాద్ మోడల్‌ను విశాఖలో పునరావృతం చేస్తాం**

విశాఖలో బలమైన ఐటీ ఎకోసిస్టమ్ లేదని, దాన్ని నిర్మించడానికే ప్రభుత్వం తక్కువ ధరకు భూములు కేటాయిస్తోందని లోకేశ్ వివరించారు. 1994-2004 మధ్య చంద్రబాబు హైదరాబాద్‌లో ఐఎస్‌బీ, మైక్రోసాఫ్ట్, ఇన్ఫోసిస్ వంటి సంస్థలకు తక్కువ ధరకే భూములు ఇవ్వడం వల్లే నేడు హైదరాబాద్ గ్లోబల్ సిటీగా మారిందన్నారు. గుజరాత్‌లో టాటా నానో ఫ్యాక్టరీకి అప్పటి సీఎం నరేంద్ర మోదీ 99 పైసలకే భూమి ఇచ్చి మొత్తం ఆటోమొబైల్ ఎకోసిస్టమ్‌ను అభివృద్ధి చేశారని గుర్తుచేశారు. అదే స్ఫూర్తితో విశాఖను ఐటీ, జీసీసీ హబ్‌గా మార్చాలనేది తమ ప్రభుత్వ విధానమని స్పష్టం చేశారు.

**ఆరోపణలు నిరూపించలేక వైసీపీ వాకౌట్**

చర్చ సందర్భంగా, అడ్రస్ లేని ఉర్సా కంపెనీకి ప్రభుత్వం భూములు కట్టబెట్టాలని చూస్తోందని వైసీపీ సభ్యులు ఆరోపించారు. ఈ ఆరోపణను మంత్రి లోకేశ్ తీవ్రంగా ఖండించారు. తాము కేవలం ఐదు కంపెనీలకే 99 పైసలకు భూములు ఇచ్చామని, ఆరో కంపెనీ అయిన ఉర్సాకు భూములు కేటాయించినట్లు ఆధారాలు బయటపెట్టాలని సవాల్ విసిరారు. నిరూపించలేకపోతే క్షమాపణ చెప్పాలని పట్టుబట్టారు. ఈ క్రమంలో వైసీపీ సభ్యులు, బొత్స సత్యనారాయణ నేతృత్వంలో నిరసనగా సభ నుంచి వాకౌట్ చేశారు.

**విశాఖలో 5 లక్షల ఐటీ ఉద్యోగాలే మా లక్ష్యం**

విపక్ష సభ్యులు వాకౌట్ చేసిన అనంతరం మంత్రి లోకేశ్ మాట్లాడుతూ..

తమ ప్రభుత్వ లక్ష్యాన్ని పునరుద్ఘాటించారు. 2029 నాటికి ఒక్క విశాఖలోనే ఐటీ రంగంలో 5 లక్షల ఉద్యోగాలు సృష్టించాలనే లక్ష్యంతో పనిచేస్తున్నామన్నారు. ఒక ఐటీ ఉద్యోగం ద్వారా పరోక్షంగా మరో ఐదారుగురికి ఉపాధి లభిస్తుందని, దీనివల్ల విశాఖ ఆర్థిక వ్యవస్థకు ఏటా 10 బిలియన్ డాలర్ల మేర మేలు జరుగుతుందని వివరించారు. ప్రభుత్వానికి రెండు రూపాయల ఆదాయం తగ్గినా పర్వాలేదు కానీ, యువతకు ఇచ్చిన 20 లక్షల ఉద్యోగాల హామీని నిలబెట్టుకుంటామని స్పష్టం చేశారు.

**ప్రతిపక్ష ఆరోపణలు సత్యదూరం**

వైసీపీ సభ్యులు సత్యదూరమైన మాటలతో ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని, ఛాలెంజ్ చేస్తే సమాధానం చెప్పలేక పారిపోవడం వారికి అలవాటేనని లోకేశ్ ఎద్దేవా చేశారు. భూముల కేటాయింపు ప్రక్రియ అత్యంత పారదర్శకంగా జరుగుతుందని, అధికారుల కమిటీ, ఎస్ఐపీబీ, కేబినెట్ ఆమోదం తర్వాతే కేటాయింపులు చేస్తున్నామని తెలిపారు. క్లస్టర్ విధానంలో పరిశ్రమలను అభివృద్ధి చేస్తామని, ప్రతి పరిశ్రమ గ్రౌండింగ్ అయ్యేలా చూస్తామని హామీ ఇచ్చారు

# రాహుల్ గాంధీ లోక్ సభ సభ్యత్వాన్ని రద్దు చేయాలి..

లోక్ సభ ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ సభ్యత్వాన్ని రద్దు చేయాలంటూ బీజేపీ ఎంపీలు డిమాండ్ చేశారు. ఈ మేరకు లోక్ సభలో బీజేపీ ఓ నోటీసును ఫైల్ చేసినట్లు సమాచారం. అయితే, రాహుల్ గాంధీకి వ్యతిరేకంగా ప్రివిలేజ్ మోషన్ దాఖలు చేయలేదని తెలుస్తోంది. బడ్జెట్ సమావేశాల సందర్భంగా బుధవారం రాహుల్ గాంధీ లోక్ సభలో ప్రసంగించిన విషయం తెలిసిందే.రాహుల్ తన ప్రసంగంలో కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర ఆరోపణలు చేశారు. రైతుల ప్రయోజనాలకు వ్యతిరేకంగా కేంద్రం అమెరికాతో ట్రేడ్ డీల్ కుదుర్చుకుందని, ప్రధాని మోదీ దేశాన్ని అమెరికాకు అమ్మేశాడని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఆర్మీ మాజీ చీఫ్ జనరల్ ఎంఎం నరవణె రాసిన బుక్ లో చైనా ఆక్రమణ విషయం స్పష్టంగా ఉందని, ఆ విషయంపై సభలో మాట్లాడకుండా అధికార పక్షం తనను అడ్డుకుంటోందని ఆయన ఆరోపించారు.ఈ ప్రసంగంపై కేంద్ర మంత్రులు, బీజేపీ ఎంపీలు సభలోనే అభ్యంతరం వ్యక్తం చేశారు. ట్రేడ్ డీల్ తో భారత్ కు ఎలాంటి నష్టం లేదని వివరించారు. రాహుల్ గాంధీ వ్యాఖ్యలు దేశాన్ని అవమానించేలా ఉన్నాయని మండిపడ్డారు. ఈ క్రమంలోనే రాహుల్ గాంధీ లోక్ సభ సభ్యత్వాన్ని రద్దు చేయాలంటూ నోటీసు ఇచ్చారు.

# పార్టీ లైన్ దాటితే చూస్తూ ఊరుకోబోం..

- మొదటి పేజి తరువాయి

ఈ సందర్భంగా పార్టీతోనే ఆయనకు గుర్తింపు వచ్చిందని, వ్యక్తిగతంగా ఆయన జీరో అనే విషయాన్ని గుర్తించాలంటూ పల్లా శ్రీనివాస్ హితవు పలికారు. అది గుర్తించి నడుచుకోవాలని సూచించారు.పార్టీ లైన్ దాటితే ఉపేక్షించబోమని టీడీపీ అధినేత చంద్రబాబు ఆదేశాలను కొలికపూడికి తెలియజేశారు. వాట్సప్ స్టేటస్ లతో ఎవరిపై పోరాటం చేస్తున్నారని పల్లా ఆయనను నిలదీశారు. మందలించినా కూడా పద్ధతి మార్చుకోకుంటే పార్టీ ఆయనను ఎమ్మెల్యేగా గుర్తించడం మానేస్తుందని స్పష్టం చేశారు. కాగా, అనుభవరాహిత్యం వల్లే పొరపాట్లు జరుగుతున్నాయని ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాస్ వివరణ ఇచ్చారు. సీనియర్లు తనకు మార్గనిర్దేశం చేయాలని ఆయన కోరారు.

# 85% కంటిచూపు కోల్పోయిన ఇమ్రాన్ ఖాన్

- మొదటి పేజి తరువాయి

సిబ్బంది అమానవీయంగా ప్రవర్తిస్తున్నారని సమాచారం. జైలు గదిలో సుదీర్ఘకాలంగా ఒంటరిగా ఉంచడంతో ఆయన కంటి చూపు కోల్పోతున్నారని, ఆరోగ్య పరిస్థితి క్షీణిస్తోందని తెలిసింది. ఈ మేరకు సుప్రీం కోర్టు నియమించిన న్యాయవాది పరిశీలనలో ఈ విషయాలు వెల్లడయ్యాయి. ఈ పరిణామాలపై స్పందించిన సుప్రీం కోర్టు, వెంటనే ఆయనకు వైద్య పరీక్షలు నిర్వహించాలని అధికారులను ఆదేశించింది. మూడు, నాలుగు నెలల క్రితం వరకు తన కుడి కన్ను చూపు సరిగ్గానే ఉందని, ఆ తర్వాత మసకగా కనిపించడం మొదలైందని న్యాయవాదితో ఇమ్రాన్ ఖాన్ పేర్కొన్నారు. ఈ విషయాన్ని జైలు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ పట్టించుకోలేదన్నారు. దాంతో పరిస్థితి విషమించి పూర్తిగా కంటిచూపు కోల్పోయే పరిస్థితి ఏర్పడిందని న్యాయవాదికి వివరించారు. ప్రస్తుతం తన కుడికన్ను 85 శాతం చూపు కోల్పోయినట్లు చెప్పారు.

**'కామరూప' పిశాచి.. ఎవరీ జెఫ్రీ ఎప్‌స్టీన్?**

ఇమ్రాన్ ఖాన్‌ను జైల్లో ఏకాంతంగా ఉంచడంతోపాటు ఆయనకు సకాలంలో వైద్య పరీక్షలు నిర్వహించడం లేదని, కుటుంబీకులను కూడా కలవకుండా జైలు అధికారులు అడ్డుకుంటున్నారని ఆరోపణలు వచ్చాయి. ఈ క్రమంలోనే కోర్టు నియమించిన అమికస్ క్యూరీ.. జైల్లో ఉన్న ఇమ్రాన్‌తో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఇమ్రాన్ ఎదుర్కొంటున్న ఆరోగ్య సమస్యలను వివరిస్తూ కోర్టుకు నివేదిక సమర్పించారు. రెండున్నరేళ్లుగా ఒంటరిగా గదిలో ఉంచారని, దీంతో మానసికంగా, శారీరక సమస్యలు ఎదుర్కొంటున్నారని అందులో పేర్కొన్నారు.

# మండలిలో మాటల యుద్ధం..

- మొదటి పేజి తరువాయి

అధికార పక్షం మా ఆరోపణలు తప్పని రుజువు చేస్తే, మా మాటలు వెనక్కి తీసుకుని సారీ చెబుతాం" అని బొత్స స్పష్టం చేశారు. అలాగే గత 19 నెలల్లో 60 ఏళ్లు నిండిన వారికి ఎన్ని కొత్త పింఛన్లు ఇచ్చారని, తాము పెట్టిన అర్హత నిబంధనలను ఏమైనా మార్చారా అని ప్రభుత్వాన్ని నిలదీశారు.బొత్స ఆరోపణలకు మంత్రి కొలుసు పార్థసారథి అంతే దీటుగా స్పందించారు. బొత్స సవాల్‌ను స్వీకరిస్తున్నట్లు ప్రకటించారు. 'తల్లికి వందనం' నిధులు నియోజకవర్గాలు, జిల్లాల వారీగా పంపిణీ చేసినట్లు పత్రాలతో సహా నిరూపిస్తామని, ఒకవేళ రుజువు చేయలేకపోతే ఏ శిక్షకైనా సిద్ధమని ప్రతిసవాల్ విసిరారు. 'అన్నదాత సుఖీభవ' కింద 48 లక్షల మందికి లబ్ధి చేకూరితే, "ఒక్కరికీ పడలేదు" అనడం బాధ్యతారాహిత్యమని విమర్శించారు. "నేను ఛాలెంజ్ చేస్తున్నా. రండి చెక్ చేద్దాం" అంటూ బొత్సను చర్చకు ఆహ్వానించారు.

ఈ చర్చలో పింఛన్ల అంశంపై మంత్రి కొండపల్లి శ్రీనివాస్ జోక్యం చేసుకున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గత 20 నెలల్లో

ఒక్క పింఛనూ తొలగించలేదని స్పష్టం చేశారు. 4.7 లక్షల మరణాల కారణంగా 2.7 లక్షల పింఛన్లు ఆగిపోయాయని, ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా 63.2 లక్షల మందికి పింఛన్లు అందిస్తున్నామని వివరణ ఇచ్చారు. మొత్తం మీద, సంక్షేమ పథకాల అమలు విషయంలో ఇరుపక్షాల ఆరోపణలు, ప్రత్యారోపణలతో మండలిలో రాజకీయ వేడి కొనసాగుతోంది.

# అడవుల్లోని గిరిజన గ్రామాలకు 'సంజీవని' డ్రోన్లు.. ఏపీలో సరికొత్త వైద్య సేవలు!

- మొదటి పేజి తరువాయి

డ్రోన్ల పైలట్ ప్రాజెక్టును అల్లూరి సీతారామరాజు జిల్లాలో విజయవంతంగా నిర్వహించారు. వాగులు, వంకలు, కొండలు, కోనలు దాటుకుని ఆసుపత్రులకు వెళ్లే గిరిజన గ్రామాల ప్రజలకు ఇప్పుడు ఈ డ్రోన్లు ప్రాణదాతలుగా మారాయి. అల్లూరి జిల్లాలోని 2,191 గిరిజన గ్రామాలకు సరైన రవాణా సదుపాయాలు లేకపోవడంతో... అత్యవసర పరిస్థితుల్లో రోగులను, గర్భిణులను డోలీల ద్వారా కిలోమీటర్ల దూరం మోసుకెళ్లడం జరుగుతోంది. ఈ ప్రయాణంలో జరిగే ఆలస్యం వల్ల ఎంతో మంది ప్రాణాలు కోల్పోతుండటం కూడా తెలిసిందే. ఈ నేపథ్యంలో బెంగళూరుకు చెందిన రెడ్ వింగ్ సంస్థతో కలిసి డ్రోన్ల సేవలను కూటమి ప్రభుత్వం ప్రారంభించింది.

ఆసుపత్రులకు వెళ్లడానికి గంటల సమయం పట్టే ప్రాంతాలకు కేవలం 15 నుంచి 20 నిమిషాల్లోనే అత్యవసర మందులను డ్రోన్లు అందజేస్తాయి. ఇవి సాధారణ డ్రోన్ల మాదిరి కాకుండా... శాటిలైట్ ట్రాకింగ్ తో ఆటోమేటెడ్ సాఫ్ట్ వేర్ తో పనిచేస్తాయి. 5 కేజీల బరువున్న మెడిసిన్స్, వ్యాక్సిన్స్, బ్లడ్ ప్యాకెట్స్, పాము కాటు మందులను చేరవేయడమే కాకుండా, అక్కడి రోగుల రక్త నమూనాలను పరీక్షల కోసం తిరిగి ఆసుపత్రికి తీసుకొస్తాయి. దీనివల్ల సకాలంలో వైద్యులు చికిత్స అందించడం సాధ్యమవుతుంది. పాడేరు డిగ్రీ కాలేజీని ప్రధాన హబ్ గా చేసుకుని ఈ డ్రోన్ ఆపరేషన్లను నిర్వహిస్తున్నారు.

# తిరుపతి లడ్డూ నెయ్యి: చంద్రబాబుపై భూమన ఆరోపణలు

- మొదటి పేజి తరువాయి

డెయిరీ ప్రొడక్ట్స్.. టీటీడీకి కేజీ నెయ్యిని రూ. 278 నుంచి రూ. 306 ధరలకే సరఫరా చేసిందని భూమన గుర్తుచేశారు. రూ. 300 లోపు నాణ్యమైన నెయ్యి ఎలా వస్తుందని ఇప్పుడు ప్రశ్నిస్తున్న చంద్రబాబు, ఆనాడు సరఫరా చేసిన నెయ్యి నాణ్యతపై సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.ఆశ్చర్యకరంగా, ఎన్డీయే అధికారంలోకి వచ్చాక మళ్లీ అదే యూనిట్ సరఫరాదారుగా వచ్చి, ఇప్పుడు కేజీ నెయ్యిని ఏకంగా రూ. 658కి సరఫరా చేస్తోందని భూమన ఆరోపించారు. చంద్రబాబు బాధ్యతలు స్వీకరించిన తర్వాత హెరిటేజ్ తయారీ యూనిట్, కర్ణాటకకు చెందిన మరో సంస్థతో కలిసి టీటీడీకి నెయ్యి సరఫరా చేస్తోందని తెలిపారు.

గతంలో రూ. 278కి సరఫరా చేసినప్పుడు నాణ్యమైనదిగా భావించి, ఇప్పుడు ధరను రూ. 658కి ఎలా పెంచారని.. దీని వెనుక ఏదైనా వ్యాపార ఒప్పందం ఉందా అని సీఎం సమాధానం చెప్పాలని భూమన నిలదీశారు. గతంలో చంద్రబాబు హయాంలో ఈ రెండు యూనిట్లు 40 లక్షల కేజీలకు పైగా నెయ్యి సరఫరా చేసినట్లు సీబీఐ ఛార్జ్‌షీట్‌లో ఉందని, దీనిపై ఆయన వివరణ ఇవ్వాలని భూమన డిమాండ్ చేశారు.

# కాకాణికి నోటీసులు జారీ చేసిన పోలీసులు

- మొదటి పేజి తరువాయి

ఆయనకు నెల్లూరు జిల్లా కోవూరు పోలీసులు నోటీసులు జారీ చేశారు. గుమ్మలదిన్నెలో బాలిక మృతిపై నిరాధార ఆరోపణలు చేశారని, ఈ నెల 14న ఉదయం 11 గంటలకు విచారణకు హాజరుకావాలని నోటీసుల్లో పోలీసులు పేర్కొన్నారు. నెల్లూరులోని ఆయన నివాసంలో నోటీసులు అందజేశారు. నోటీసులపై కాకాణి ఇంకా స్పందించాల్సి ఉంది.

మరోవైపు, నెల్లూరు జిల్లాలో జరిగిన అక్రమ మైనింగ్ కేసులో కాకాణి ఇప్పటికే జైలుకు వెళ్లిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం ఆయన బెయిల్ పై బయట ఉన్నారు. బెయిల్ పై బయటకు వచ్చినప్పటి నుంచి ఆయన కూటమి ప్రభుత్వంపై విమర్శల దాడిని మరింత పెంచారు.

# ఢిల్లీలో రేవంత్ రెడ్డి బిజీబిజీ..

- మొదటి పేజి తరువాయి

వివిధ విమానాశ్రయాల అభివద్ధి పనులకు సంబంధించిన అంశాలపై చర్చించారు.వరంగల్‌లోని మామునూరు విమానాశ్రయానికి సంబంధించి భూసేకరణ ప్రక్రియ పూర్తయిందని, ఈ క్రమంలో తదుపరి పనులు చేపట్టాలని కేంద్రమంత్రిని ముఖ్యమంత్రి కోరారు. కొత్తగూడెం విమానాశ్రయానికి సంబంధించి పాల్వంచలో స్థలం గుర్తించామని తెలిపారు. ఓఎల్ఎస్ సర్వే, ఫీజబిలిటీ స్టడీ నిర్వహించాలని కోరారు. ఆదిలాబాద్ విమానాశ్రయానికి సంబంధించి, అదనంగా 249.82 ఎకరాలు కేంద్ర ప్రభుత్వానికి ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్‌ను కూడా కలిశారు. తెలంగాణ రాష్ట్రానికి సంబంధించిన రైల్వే ప్రాజెక్టులపై ఆయనతో చర్చించారు. ముఖ్యమంత్రి నిన్న రక్షణ శాఖ మంత్రి రాజ్ నాథ్ సింగ్ తదితరులతో భేటీ అయ్యారు.

# సంక్రాంతి లక్కీడ్రా కేసులో అంబటికి రిమాండ్

మాజీ మంత్రి, వైసీపీ సీనియర్ నేత అంబటి రాంబాబుకు మరో కేసులో రిమాండ్ పడింది. 2023లో సత్తెనపల్లిలో సంక్రాంతి సంబరాల సందర్భంగా నిర్వహించిన లక్కీ డ్రా కేసులో గుంటూరు ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ కోర్టు ఆయనకు 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించింది. వైసీపీ ప్రభుత్వంలో మంత్రిగా ఉన్న సమయంలో, 2023 జనవరిలో అంబటి రాంబాబు సంక్రాంతి సంబరాల పేరుతో లక్కీ డ్రా నిర్వహించారు. ఈ సందర్భంగా వాలంటీర్ల ద్వారా పింఛనుదారుల నుంచి రూ.200 చొప్పున అక్రమంగా వసూలు చేసి, వారికి బలవంతంగా లాటరీ టికెట్లు అంటగట్టారన్న ఆరోపణలు ఉన్నాయి. ఈ వ్యవహారంపై జనసేన పార్టీ గుంటూరు జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు కోర్టులో ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేశారు.ప్రస్తుతం మరో కేసులో రాజమండ్రి సెంట్రల్ జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్న అంబటిని, పోలీసులు పీటీ వారెంట్‌పై ఇవాళ గుంటూరు కోర్టులో హాజరుపరిచారు. కేసు వివరాలను పరిశీలించిన న్యాయమూర్తి ఎం. కుముదిని, ఆయనకు 14 రోజుల రిమాండ్ విధిస్తూ ఆదేశాలు జారీ చేశారు. కోర్టు ఉత్తర్వుల నేపథ్యంలో అంబటిని తిరిగి రాజమండ్రి జైలుకు తరలించారు.సీఎం చంద్రబాబుపై అనుచిత వ్యాఖ్యల కేసులో బెయిల్ లభించగా, గతేడాది మెడికల్ కాలేజీ అంశంపై నిర్వహించిన ఆందోళనల్లో పోలీసులతో దురుసుగా ప్రవర్తించారన్న కేసులోనూ ఆయనకు బెయిల్ లభించింది. ఈ రెండు కేసుల్లో బెయిల్ రావడంతో అంబటి విడుదల కావడం లాంఛనమేనని అందరూ అనుకున్నారు. అయితే, పోలీసులు సంక్రాంతి లక్కీ డ్రా కేసులో పీటీ వారెంట్ పై కోర్టును ఆశ్రయించగా, న్యాయమూర్తి రిమాండ్ విధించడంతో అంబటికి నిరాశే మిగిలింది. తాజా రిమాండ్‌తో ఆయన విడుదల ఆగిపోయింది.

పెన్ పవర్
కాకినాడ
డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా

# అభివృద్ధికి చిరునామా వరుపుల



**రౌతులపూడి పెన్ పవర్ ఫిబ్రవరి 11** .రౌతులపూడి మండలాల్లో పి.చామవరం నుండి మండపం వరకు 1.57 కోట్లు, పారుపాక నుండి గిడజాం వరకు 1.75 కోట్లు బీటీ రోడ్లను మంజూరు చేసి. గ్రామాల రూపురేఖలు మార్చడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందనడానికి ఇదే నిదర్శనం ప్రత్తిపాడు శాసనసభ్యురాలు సత్య ప్రభ రాజా అన్నారు.జాతిపిత మహాత్మా గాంధీ పేర్కొన్న "పల్లెలే దేశానికి పట్టుకొమ్మలు" అన్న మాటలను నిజం చేస్తూ గ్రామాల సమగ్ర అభివృద్ధే కూటమి ప్రభుత్వ ధ్యేయమని ఆమె తెలిపారు. మండలంలో అభివృద్ధిలో బీటి రోడ్లకు గాను మూడు కోట్ల 32 లక్షలు నిధులను మంజూరు చేసిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ లకు మండల ప్రజానీకం తరపున ఆమె కృతజ్ఞతలు తెలియజేశారు.


# స్వయంభుగా వెలసిన గొరబంద శివాలయాలు





పోలవరం జిల్లా, వై.రామవరం మండలం లో యార్లగడ్డ పంచాయతీ అటవీ ప్రాంతంలో స్వయంభుగా వెలసిన శ్రీ కాశీ విశ్వేశ్వర స్వామి ఆలయం గొరబంద అటవీ ప్రాంతంలో ఉంది. నాగసర్పం పడగ వలే ఉండే పెద్ద బండరాయి క్రింద స్వయంభుగా కాశీ విశ్వేశ్వర స్వామి వెలిసి దశాబ్దాలుగా పూజలు అందుకుంటున్నారని గిరిజన పూజారులు తెలిపారు. గతంలో పాండవులు అరణ్యవాసం చేసినప్పుడు రెండు కొండలు కలిసే విధంగా నిర్మాణం చేపట్టదలిచారని పూర్వీకులు తెలిపారు. ఈ నిర్మాణం తెల్లవారే సమయానికి అయిపోవాలని నిర్ణయించి పనులు ప్రారంభించారని, వీరిలో ఒక వ్యక్తి కోడివలే కూత కూయడంతో నరులు వస్తారని, తమను చూస్తారని నిర్మాణం మధ్యలో నిలిపేసి పాండవులు వెళ్లిపోయారని పూర్వీకులు కథలుగా చెబుతుంటారు. ఈ అటవీ ప్రాంతంలో శివాలయం ప్రాంగణంలో స్వయంభుగా వెలిసిన శివ లింగంపై సంవత్సరం పొడవునా చుక్క చుక్క నీటి బిందువులు పడుతూ ఉంటాయని గిరిజన పూజారులు తెలిపారు. కొత్తగా పెళ్లయిన దంపతులు ప్రక్కనే సెలయేట్లో స్నానమాచరించి మడి బట్టలతో ఆలయ ప్రాంగణంలో ఉన్న నందీశ్వరుని ఎత్తుకుంటారని తెలిపారు. అనంతరం స్వయంభు లింగం పై పడే నీటి బిందువులను చేతిలో పట్టు కొంటె సంతానం కలిగే జంటలకు పాలవలే కనిపిస్తాయని, సంతానం లేని జంటలకు నీలవలే కనిపిస్తాయని ఒక కథ నానుడిలో ఉందని పూజారులు తెలిపారు. ఈ నీటిని స్వీకరిస్తారని తెలిపారు. ఈ శివాలయములో పూజలాచరించిన భక్తులకు సంతానం కలిగితే విశ్వేశ్వర స్వామి పేరు కలిసే విధంగా నామకరణం చేస్తారని తెలిపారు. గతంలో సర్పంచ్ పడగ ఆకారంలో ఉండే రాయికి పదుల సంఖ్యలో తేనె పట్లు ఉండేవని తెలిపారు. ఈ ప్రాంతంలో శివరాత్రి రోజున తెర సినిమా లు వేసేవారని, వర్షం వచ్చిన ఏ ఒక్క భక్తుడు తడిచేవాడు కాదని తెలిపారు. వై రామవరం నుండి గొరబంద గతంలో కాలినడకన వెళ్లేవారని ప్రస్తుతం వాహన సౌకర్యాలు ఉన్నాయని అన్నారు.

**కృష్ణ రిపోర్టర్ వై రామవరం**





## పూతి గుంట ఉబ్బలింగేశ్వర స్వామి స్వయంభూ ఆలయం





పోలవరం జిల్లా వై రామవరం మండలంలోని చవిటి దిబ్బలు పంచాయతీ పూతి గుంట గ్రామ సమీపంలో పెద్దేరు ఒడ్డున స్వయంభుగా శ్రీ ఉబ్బలింగేశ్వర స్వామి వెలిశాడని గ్రామస్తులు తెలిపారు. దశాబ్దాల క్రితం దట్టమైన అటవీ ప్రాంతంలో సర్పం, అడవి పంది నిత్యం పూజలు ఆచరించే వని పూర్వీకులు తెలిపారు. పూర్వకాలం అటవీ ప్రాంతంలో పశువులను మేపుటకు వెళ్లిన ఒక గిరిజనునికి అడవి పంది, సర్పం ఒక రాయి చుట్టూ ప్రదక్షిణలు చేయడం చూసి గ్రామస్తులకు తెలిపాడని అన్నారు. నాటి నుండి నేటి వరకు శివరాత్రి రోజున శ్రీ ఉబ్బలింగేశ్వర స్వామి నామకరణం చేసి పూజలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ శివాలయం పక్కనే పెద్దేరు వాటర్ ఫాల్స్ భక్తులకు ఆహ్లాదకరమైన వాతావరణం ఉంటుందని తెలిపారు. శివాలయాల దగ్గర భక్తుల కు ఉచిత అన్నదాన సౌకర్యం ఉందని తెలిపారు.ప్రతి సంవత్సరం శివరాత్రి రోజున మైదాన ప్రాంతానికి చెందిన భక్తులు వేల సంఖ్యలో వచ్చి శివాలయాలను దర్శించుకుంటారని తెలిపారు. భక్తుల తాకిడి పెరగడంతో రహదారి సౌకర్యం సక్రమంగా లేకపోవడం ఇబ్బందికరంగా ఉంటుందని మైదాన ప్రాంత భక్తులు అంటున్నారు.

**ఈ కృష్ణ రిపోర్టర్ వై రామవరం**

## ద్రాక్షారామ భీమేశ్వర స్వామి దేవస్థానంలో హుండీల లెక్కింపు

**78 రోజుల్లో రూ.26.59 లక్షల ఆదాయం**



**ద్రాక్షారామం, పెన్ పవర్, ఫిబ్రవరి 12:**శ్రీ మాణిక్యాంబా సమేత శ్రీ భీమేశ్వర స్వామి వారి దేవస్థానంలో గురువారం హుండీల లెక్కింపు కార్యక్రమం నిర్వహించారు. 27-11-2025 నుంచి 12-02-2026 వరకు మొత్తం 78 రోజుల వ్యవధిలో ఆలయ హుండీల ద్వారా రూ.26,59,090 ఆదాయం వచ్చినట్లు దేవస్థాన సహాయ కమిషనర్ అల్లు వెంకట దుర్గా భవాని మీడియాకు తెలిపారు.అదేవిధంగా అన్నదానం హుండీ ద్వారా రూ.87,526 ఆదాయం సమకూరినట్లు వెల్లడించారు.ఈ లెక్కింపు కార్యక్రమాన్ని అంగర గ్రూప్ టెంపుల్స్ కార్యనిర్వహణాధికారి ఎం. శ్రీదేవి, ఓదురు గ్రూప్ టెంపుల్స్ కార్యనిర్వహణాధికారి వి. శ్రీనివాస్, గంగవరం గ్రూప్ టెంపుల్స్ కార్యనిర్వహణాధికారి వి. బాలకృష్ణ సమీక్షించారు.కార్యక్రమంలో ఆలయ అర్చకులు, సిబ్బంది, సేవా సిబ్బంది, భక్తులు, ద్రాక్షారామ ఎస్.ఐ., ద్రాక్షారామ సొసైటీ చైర్మన్ ముప్పనపల్లి గణేష్, దవులూరి రామకృష్ణ, అల్లం రామకృష్ణ, ఆళ్ల బుజ్జి, సలాది శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## ప్రత్తిపాడు మండలంలో పలువురికి మురళీ కృష్ణంరాజు పరామర్శ



-కాకినాడ నాగాయమ్మ కుటుంబానికి రూ.5 వేలు ఆర్థిక సాయం.

**కిర్లంపూడి/ప్రత్తిపాడు, పెన్ పవర్, ఫిబ్రవరి 12:** కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గంలో కష్టంలో ఉన్న నిరుపేదలను ఆదుకునేందుకు ఎంఎంఆర్ చారిటబుల్ ట్రస్ట్ అండగా ఉంటుందని ట్రస్ట్ చైర్మన్,ప్రత్తిపాడు నియోజకవర్గం వైసిపి నేత, నరసాపురం పార్లమెంట్ నియోజకవర్గం పరిశీలకులు ముదునూరి మురళీకృష్ణంరాజు అన్నారు.ప్రత్తిపాడు మండలం ఒమ్మంగి గ్రామానికి చెందిన కాకినాడ నాగాయమ్మ ఇటీవల అకాల మరణం చెందతో విషయం తెలుసుకున్న ముదునూరి మురళీకృష్ణంరాజు గురువారం నాగయమ్మ కుటుంబ సభ్యులను పరామర్శించి,ప్రగాఢ సానుభూతి తెలియజేసి రూ.5000 ఆర్థిక సాయం అందించారు.అలాగే ఒమ్మంగి గ్రామానికి చెందిన కరణం నాగమణి మృతి చెందడంతో వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు.ధర్మవరం గ్రామానికి చెందిన బావిశెట్టి రాఘవ,బొల్లు రాజేష్ రోడ్డు ప్రమాదంలో గాయపడి మరణించడంతో వారి కుటుంబ సభ్యులను పరామర్శించి తీవ్ర విచారం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా మురళీకృష్ణంరాజు మాట్లాడుతూ బాధిత కుటుంబానికి ఏ కష్టం వచ్చినా అండగా ఉంటానని భరోసా కల్పించారు.ఈ కార్యక్రమంలో గంటా గంగ బాబు,లచ్చ బాబు,తోలేటి శేఖర్,సుంకర తమ్మారావు,నార్లంక వెంకన్న,రామకుర్తి ఏసుబాబు,కోలా తాతబాబు,దాడి పుత్రయ్య, మారెళ్ల అప్పన్న బాబు తదితరులు పాల్గొన్నారు.

## మండల కార్యాలయ ప్రాంగణంలోనే ముప్పు గూటి... విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను చుట్టేసిన పిచ్చిమొక్కలు!



**కాజులూరు, పెన్ పవర్, ఫిబ్రవరి 12:**ప్రజల సమస్యలు పరిష్కరించాల్సిన మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయం ప్రాంగణంలోనే ప్రమాదం పొంచి ఉండటం ఆందోళన కలిగిస్తోంది. కార్యాలయం ఆవరణలో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ స్తంభాన్ని పొడవునా పిచ్చిమొక్కలు, పాదులు చుట్టేసి ఉన్న దృశ్యం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనంగా మారింది.ఇది సాధారణ ప్రదేశం కాదు. నిత్యం ప్రజాప్రతినిధులు, అధికారులు, సిబ్బంది, గ్రామాల నుంచి వచ్చే ప్రజలు రాకపోకలు సాగించే కేంద్రం. అంతేకాదు, ఇక్కడే ఉపాధి హామీ పథకం శాఖ కార్యాలయం కూడా ఉంది.తరచూ సమావేశాలు, కార్యక్రమాలు జరుగుతుంటాయి. వాహనాలు నిలిపే ప్రదేశం కూడా ఇదే. ఇలాంటి ప్రదేశంలో ట్రాన్స్‌ఫార్మర్ స్తంభానికి పిచ్చిమొక్కలు అల్లుకోవడం ఎంతటి ప్రమాదమో చెప్పనక్కర్లేదు. వర్షాలు, ఈదురు గాలులు వచ్చినప్పుడు విద్యుత్ తీగలు తెగిపడే ప్రమాదం ఉంది. విద్యుత్ సరఫరా నిలిచిన సందర్భంలో గెడను ముట్టుకోవాల్సి వస్తే, పొరపాటున ఎవరైనా విద్యుత్ షాక్‌కు గురయ్యే పరిస్థితి ఉంది. ఇప్పటికే స్తంభం చుట్టూ అడవిలా పెరిగిన పాదులు సర్పాలకు ఆశ్రయంగా మారే ప్రమాదం కూడా ఉంది.మండలంలో 26 గ్రామ పంచాయతీలు ఉండగా, పచ్చదనం--పరిశుభ్రత, ప్రజా ఆరోగ్యం, దోమల నివారణపై ఇక్కడి నుంచే నినాదాలు వినిపిస్తాయి. ప్రతి మూడు నెలలకు ఎంపీపీ అధ్యక్షతన సర్వసభ్య సమావేశాలు నిర్వహిస్తారు. "పరిశుభ్రతే ఆరోగ్యానికి రక్ష" అంటూ ఉపన్యాసాలు చేసే కార్యాలయ ప్రాంగణం ఇలా ఉండటం తీవ్ర విమర్శలకు దారి తీస్తోంది.ఇప్పటికే దోమల బెడదతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. పాముల సంచారం భయం మరింత పెరిగింది. ప్రమాదం జరిగిన తర్వాత స్పందించడం కన్నా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం అవసరమని స్థానికులు అంటున్నారు.ఇకనైనా సంబంధిత శాఖ అధికారులు తక్షణమే స్పందించి ట్రాన్స్‌ఫార్మర్ స్తంభాన్ని చుట్టేసిన పిచ్చిమొక్కలను తొలగించి, ప్రమాదాన్ని నివారించాలి. ప్రజల ప్రాణ భద్రతపై నిర్లక్ష్యం ప్రదర్శించడం అసలు సహించరానిది.




# కేంద్ర ప్రభుత్వ కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలు నశించాలి




**జగ్గంపేట, పెన్ పవర్, ఫిబ్రవరి 12**: కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలు నశించాలని డిమాండ్ చేస్తూ బుధవారం జగ్గంపేటలో వామపక్షాలు, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో నిరసనలు, మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు, ఐ ఎఫ్ టి యు రాష్ట్ర ఉపాధ్యక్షులు మరుకుర్తి ఏసు, ఐఎఫ్టియు జాతీయ కమిటీ సభ్యుడు వి.చిట్టిబాబు, సిపిఐ ఎంఎల్ లిబరేషన్ నాయకులు రాజు, సిఐటియు మండల కార్యదర్శి పి సుజాత తదితర నాయకులు పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోడీ అధికారంలోకి వచ్చిన తర్వాత కార్మికులు, రైతులు ఇబ్బందులు పడుతున్నారే తప్ప వారికి న్యాయం చేయడంలో విఫలమయ్యారని వారు విమర్శించారు. ప్రైవేట్, కార్పొరేట్ శక్తుల చేతుల్లోకి దేశాన్ని మొత్తం పెట్టి అప్పుల ఊబిలో పడేస్తున్నారని వారు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలి. వి బి జి రాంజీ చట్టం రద్దు చేయాలి. జాతీయ విత్తన చట్టం రద్దు చేయాలి. విద్యుత్ సవరణ బిల్లును రద్దు చేయాలి. వీటిని రద్దు చేయకుండా పరిపాలన సాగిస్తామంటే ఎట్టి పరిస్థితుల్లోనూ ఒప్పుకోబోమని, భవిష్యత్తులో ఇంకా పెద్ద ఎత్తున కార్యక్రమాలు చేపడతామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రైతు కూలీ సంఘం నాయకులు డాన్ శ్రీను, ఏఐకేఎంఎస్ ఉమ్మడి జిల్లా అధ్యక్షులు గంట బాలరాజు, ఏఐకేఎంఎస్ జిల్లా కమిటీ సభ్యులు బాబురావు, ఐఎఫ్టియు జిల్లా కమిటీ సభ్యులు వరదరాజు, పిఓడబ్ల్యు జిల్లా కమిటీ సభ్యురాలు వి.శాంతి, జిల్లా కమిటీ సభ్యురాలు ఎస్ .లక్ష్మి, జగ్గంపేట మండలం యానిమేటర్ మండల కార్యదర్శులు శ్రీదేవి, జి.ఈశ్వరి, సిఐటియు జిల్లా గౌరవ అధ్యక్షులు బోర సత్తిబాబు ,యుటిఎఫ్ నాయకులు వెంకటేశ్వరరావు, బిల్డింగ్ వర్కర్స్ టౌన్ ప్రెసిడెంట్ కొల్లే సత్తిబాబు, ఏపీడబ్ల్యూజేఎఫ్ నియోజకవర్గం ప్రెసిడెంట్ అడబాల వీరభద్రరావు, ఆశ వర్కర్స్ యూనియన్ మండల ప్రెసిడెంట్ సిహెచ్ మంగ, అంగన్వాడి నాయకులు గంగ భవాని ,ఏ.నాగమణి, వి రామలీల ,కృపాభాయ్, అమ్మాజీ, ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం కార్యకర్తలు, కూలీలు ,కార్మిక సంఘం కార్యకర్తలు, ఆశ వర్కర్లు, అంగన్వాడీలు, యానిమేటర్లు, బ్యాంకు ఉద్యోగస్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రి సహాయనిది పేదలకు వరం

జిల్లా టిడిపి అధ్యక్షులు జ్యోతుల నవీన్



**జగంపేట, పెన్ పవర్, ఫిబ్రవరి 12:** స్థానిక రావులమ్మ నగర్ లోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో టిడిపి కాకినాడ జిల్లా అధ్యక్షులు ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను పంపిణీ చేశారు. అత్యవసర వైద్య ఖర్చులకు, ఆరోగ్యశ్రీ పరిధిలోకి రాని చికిత్సల కోసం ఎదురవుతున్న ఆర్థిక బాధలను తీర్చేందుకు ప్రభుత్వం అందిస్తున్న సహాయనిధి చెక్కులను లబ్ధిదారులకు అందించాలని జగంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ పార్టీలకు, కుల మతాలకు అతీతంగా వైద్యం చేయించుకున్న వారికి ప్రభుత్వం ద్వారా ముఖ్యమంత్రి సహాయనిది అందిస్తున్నామని పేదవారి సంక్షేమం కోసం కూటమి ప్రభుత్వం అహర్నిశలు కృషి చేస్తుందనిఅన్నారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు జీనుమణి బాబు, సొసైటీ చైర్మన్ బుర్రి సత్తిబాబు, దేవరపల్లి మూర్తి, తిరుమలాయపాలెం సర్పంచ్ పురంశెట్టి శివాజీ, గోవిందపురం సర్పంచ్ కమ్మిల వెంకటేశ్వరరావు, పిట్ట అరుణ్, మారిశెట్టి రాధా, ఉండవల్లి చందు, గండే చినరాజు, కొత్తపల్లి సత్యనారాయణ నలమాటి ఆనంద్, నాని రాజు, ఆయిల్ స్వామి, కొల్లు రామకృష్ణ, హనుమంతు పద్మనాభం, తదితరులు పాల్గొన్నారు.

# "సైబర్ సెక్యూరిటీ" అనే అంశంపై వర్క్ షాప్




**గండేపల్లి, పెన్ పవర్, డిసెంబర్, 12:**గండేపల్లి మండలం సూరంపాలెం ఆదిత్య కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాల (అటానమస్) లో ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో "సైబర్ సెక్యూరిటీ" అనే అంశంపై ఆరు రోజుల పాటు విద్యార్థుల నైపుణ్య అభివృద్ధి శిక్షణా కార్యక్రమం ప్రారంభమైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ డా. రమేష్ తెలిపారు. ఈ కార్యక్రమానికి ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ప్రతినిధి పి. కార్తీక్ కుమార్ శిక్షణ అందించనున్నారు. సైబర్ సెక్యూరిటీ, ఎథికల్ హ్యాకింగ్, పెనిట్రేషన్ టెస్టింగ్, నెట్వర్క్ సెక్యూరిటీ వంటి అంశాలపై ప్రాయోగిక శిక్షణ ఇవ్వబడుతుంది అని తెలిపారు.ఈ వర్క్ షాప్ ద్వారా విద్యార్థులకు సాంకేతిక పరిజ్ఞానం తో పాటు భద్రతా అవగాహన పెంపొందించడమే లక్ష్యమని ఉపాధ్యాయులు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో విభాగాధిపతులు డాక్టర్ బి. మాణిక్యాలరావు, డాక్టర్ కె. నాగ భార్గవి, వర్క్ షాప్ కోఆర్డినేటర్ బి. సంతోషి మరియు ఇతర అధ్యాపకులు పాల్గొన్నారు.

# పాడిపశువులు పెంపకంపై పాడి రైతులు శ్రద్ధ వహించాలి





గ్రామ సర్పంచ్ దొమ్మ శ్రీను

**గండేపల్లి, పెన్ పవర్, ఫిబ్రవరి, 12:**పాడి రైతులు పాడిపశువులపై పెంపకం పై శ్రద్ధ వహించాలని మల్లేపల్లి గ్రామ సర్పంచ్ రైతులకు సూచించారు. గురువారం మల్లేపల్లి గ్రామపంచాయతీ ఆవరణలో లేక దూడల ప్రదర్శన కార్యక్రమం స్థానిక పశువైద్యాధికారి శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ దొమ్మ శ్రీను ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు పాడి పశువులపై కూడా శ్రద్ధ వహించడం ద్వారా అధిక లాభాలు పొందవచ్చునన్నారు. ముఖ్యంగా పశువులకు పెట్టే పశు గ్రాసం దగ్గర నుండి ఉండే పరిసరాలను పరిశుభ్రంగా ఉండటం ద్వారా ఎటువంటి అంటురోగాలు సోకకుండా చూసుకోవలసిన బాధ్యత పశువుల రైతుల దేని అన్నారు. ప్రస్తుతం పాలు డిమాండ్ ఎక్కువగా ఉన్న కారణంగా పంటలతో పాటు పాడి కూడా రైతులకు అధిక లాభాలుస్తుందని తెలియజేశారు.

ఫెర్టిలిటీ క్యాంపును గ్రామ సర్పంచ్ దొమ్మ శ్రీను ప్రారంభించగా ఈ కార్యక్రమంకు మల్లెపల్లి గ్రామ టీడీపీ నాయకులు తేలగరెడ్డి భద్రరావు , కొల్లి త్రిమూర్తులు , జనసేన నాయకులు నరసింహం మరియు ఇతర ప్రజా ప్రతినిధులు పాల్గునడం జరిగింది.

ఈ కార్యక్రమంకు పశుసంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ అంబేద్కర్ , డి ఎల్ డి ఏ డాక్టర్. కళ్యాణి , గండేపల్లి మండలపశు వైద్యాధికారి , మురారి పశువైద్యాధికారిని కృష్ణవేణి , నాయకంపల్లి పశు వైద్యాధికారి శ్యాంప్రసాద్ మరియు పశుసంవర్ధక శాఖ సచివాలయ సిబ్బంది, గోపాలమిత్రలు పాల్గొనగా .

లేగ దూడల ప్రదర్శన కార్యక్రమంలో రైతులు 40 దూడలను ప్రదర్శించడం జరిగింది ఈ ప్రదర్శనలో మొదటి విజేతగా వల్లభశెట్టి రాజు గేదే దూడను, రెండవ బహుమతి గా గాలిదేరి రాంబాబు కి చెందిన గేదే దూడ, మూడవ బహుమతి వనపర్తి వెంకటేష్ గేదే దూడగాను ఎంపిక చేయడం జరిగింది. ప్రదర్శనలో పాల్గొన్న రైతులందరికీ బహుమతులు అందజేయడం జరిగింది

ఫెర్టిలిటీ క్యాంపు లో భాగంగా 45 పశువులకు గర్భకోశ వ్యాధి చికిత్స మరియు చూడి నిర్ధారణ పరీక్షలు నిర్వహించి అవసరం అయినా మందులు పంపిణి చేయడం జరిగింది.

# కోనసీమ తిరుమల వాడపల్లిలో గోవిందమాల కార్యక్రమాలు వైభవంగా





తిరుప్పావడ సేవ, పర్వేట మహోత్సవం ఘనగా

**ఆత్రేయపురం పెన్ పవర్ ఫిబ్రవరి12:**కోనసీమ తిరుమలగా ప్రసిద్ధిగాంచిన వాడపల్లి దివ్యక్షేత్రంలో వేంచేస్తున్న శ్రీ భూసమేత శ్రీ వేంకటేశ్వర స్వామివారి సన్నిధిలో వార్షిక గోవిందమాల దీక్షాధారణ కార్యక్రమాలు మాఘ బహుళ దశమి గురువారం అత్యంత భక్తిశ్రద్ధలతో, అంగరంగ వైభవంగా నిర్వహించబడ్డాయి. ఆలయ ప్రాంగణం మొత్తం భక్తజన సమూహాలతో కళకళలాడింది.

మాఘమాసం సందర్భంగా ప్రత్యక్ష భగవానుడైన సూర్యనారాయణ మూర్తిని ఆరాధిస్తూ గురు వారం ఉదయం అరుణ పారాయణం, సూర్య నమస్కారాలు నిర్వహించారు. వేద మంత్రోచ్చారణల నడుమ జరిగిన ఈ కార్యక్రమాలు ఆధ్యాత్మిక వాతావరణాన్ని మరింత మాధుర్యంగా మార్చాయి.అనంతరం తిరుమల క్షేత్రంలో ప్రతి గురువారం నిర్వహించే ప్రసిద్ధి చెందిన తిరుప్పావడ సేవను సంప్రదాయబద్ధంగా ఘనంగా నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారికి ప్రత్యేక నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.ఇదే సందర్భంలో తిరుమలలో మకర సంక్రాంతి రోజున నిర్వహించే పర్వేట మహోత్సవంను కోనసీమ తిరుమలలో ప్రతిరూపంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులను ఆలయ పరిసరాల్లో ఊరేగింపుగా తీసుకెళ్లి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు హర్షధ్వానాల మధ్య కార్యక్రమాన్ని వీక్షించి తరించారు.ఈ కార్యక్రమాలు ఆలయ డిప్యూటీ కమిషనర్ నల్లసూరి చక్రధర్ రావు, ఆలయ చైర్మన్ ముదునూరి వెంకటరాజు సమక్షంలో శాస్త్రోక్తంగా నిర్వహించబడ్డాయి. ఆలయ అధికారులు, అర్చకులు, సేవాదారులు సమన్వయంతో ఉత్సవాలను విజయవంతం చేశారు.

# జర్నలిస్ట్ యేసురాజు ను పరామర్శించిన జనసేన పార్టీ ఇంచార్జ్ బండారు శ్రీనివాస్



**ఆలమూరు, పెన్ పవర్, ఫిబ్రవరి 12;**కొత్తపేట నియోజవర్గ జనసేన పార్టీ ఇంచార్జ్ బండారు శ్రీనివాస్ మండలంలోని సంధిపూడిలో గురువారం పర్యటించారు. ఈసందర్భంగా కాలికి తగిలిన గాయానికి శస్త్ర చికిత్స చేయించుకుని ఇంటి వద్దనే విశ్రాంతి తీసుకుంటున్న నామాల యేసు రాజు (సాక్షి విలేకరి) ను పరామర్శించి యోగ క్షేమాలను అడిగి తెలుసుకున్నారు. త్వరితగతిన కోలుకుని దైనందిన జీవితంలోకి రావాలని ఆయన ఆకాంక్షించారు. జనసేన పార్టీ మండల అధ్యక్షులు సూరపురెడ్డి సత్య, చింతలూరు సొసైటీ చైర్మన్ నల్లా వెంకన్న, గ్రామ సర్పంచ్ తోట భవానీ వెంకటేశ్వర్లు, మోటుపల్లి రాంబాబు పాల్గొన్నారు.

# ఆదిత్య యూనివర్సిటీ రోటరాక్ట్ క్లబ్ ఆధ్వర్యంలో నారీ స్వాస్థ్య అవగాహన కార్యక్రమం



**గండేపల్లి, పెన్ పవర్, ఫిబ్రవరి ,12**:ఆదిత్య యూనివర్సిటీ రోటరాక్ట్ క్లబ్ ఆధ్వర్యంలో "నారీ స్వాస్థ్య" పేరుతో మహిళల ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమం యొక్క ప్రధాన ఉద్దేశ్యం మహిళల శారీరక, మానసిక ఆరోగ్యంపై అవగాహన పెంపొందించడం మరియు యువతుల్లో ఆరోగ్య పరిరక్షణపై చైతన్యం కల్పించడం.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రసిద్ధ వైద్య నిపుణురాలు డా. దీప్తి చిగుళ్ల పల్లి. హాజరై, మహిళల ఆరోగ్యానికి సంబంధించిన ముఖ్య అంశాలపై సమగ్రంగా వివరించారు. ముఖ్యంగా మెన్స్ట్రువల్ హెల్త్, పోషకాహారం ప్రాముఖ్యత, హార్మోనల్ మార్పులు, అనీమియా నివారణ, మరియు నియమిత ఆరోగ్య పరీక్షల అవసరం పై ఆమె అవగాహన కల్పించారు.డా. దీప్తి మహిళలు తమ ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయకుండా, సమయానికి వైద్య సలహా తీసుకోవాలని సూచించారు. అలాగే వ్యక్తిగత పరిశుభ్రత, సరైన ఆహారపు అలవాట్లు, మరియు వ్యాయామం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని తెలిపారు.ఈ కార్యక్రమంలో అనేక మంది విద్యార్థినులు పాల్గొని, తమ సందేహాలను అడిగి నివృత్తి చేసుకున్నారు. రోటరాక్ట్ క్లబ్ సభ్యులు కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించి, మహిళా సాధికారతకు తోడ్పడే ఈ విధమైన కార్యక్రమాలు భవిష్యత్తులో మరిన్ని నిర్వహిస్తామని తెలిపారు.

# వైద్య విద్యాభ్యున్నతికి విశ్రాంత వైద్యుని దాతృత్వం



**కాకినాడ, పెన్ పవర్, ఫిబ్రవరి 12:**రంగరాయ వైద్య కళాశాల చెవి, ముక్కు, గొంతు (ఈఎన్‌టీ) విభాగ వైద్య విద్యార్థుల అభ్యాసానికి ఉపయోగపడే అకడమిక్, ఆపరేషనల్ పుస్తకాలను విశ్రాంత వైద్యుడు డాక్టర్ సుధీర్ అందజేసి తన దాతృత్వాన్ని చాటుకున్నారు.కాకినాడ ప్రభుత్వా సుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ లావణ్య కుమారి, ఈఎన్‌టీ విభాగాధిపతి డాక్టర్ ప్రవీణ సమక్షంలో సుమారు రూ.12 వేల విలువైన అరుదైన పుస్తకాలను విద్యార్థులకు అందజేశారు. ఈ పుస్తకాలు విద్యార్థుల ప్రాక్టికల్ జ్ఞానం, శస్త్రచికిత్సా నైపుణ్యాల అభివృద్ధికి దోహదపడతాయని తెలిపారు. రంగరాయ వైద్య కళాశాలలోనే విద్యాభ్యాసం చేసిన డాక్టర్ సుధీర్, అనంతరం ఈఎన్‌టీ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా, కాకినాడ ప్రభుత్వాసుపత్రిలో ఏఆర్ఎంఓగా సేవలందించారు. తన అనుభవాన్ని గుర్తుచేసుకుంటూ ప్రస్తుత విద్యార్థులకు ఉపయోగపడేలా పుస్తకాలను అందజేయడం అభినందనీయమని సూపరింటెండెంట్ డాక్టర్ లావణ్య కుమారి పేర్కొన్నారు.వైద్య విద్యాభి వృద్ధికి చేసిన ఈ సేవకు డాక్టర్ సుధీర్‌ను అధికారులు, సిబ్బంది అభినందించారు.

# ఆదిత్య డిగ్రీ కళాశాలలో అంతర కళాశాలల చెస్ చాంపియన్‌షిప్-2026 ఘన ప్రారంభం






**కాకినాడ, పెన్ పవర్,ఫిబ్రవరి 12 :** ఆదిత్య డిగ్రీ మరియు పీజీ కళాశాలలో అంతర కళాశాలల పురుషుల చెస్ చాంపియన్‌షిప్--2026 పోటీలు, అలాగే ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ బృందం ఎంపిక ప్రక్రియ ఘనంగా ప్రారంభమైంది. ఈ విషయాన్ని అంతర కళాశాలల పురుషుల చెస్ కన్వీనర్ మరియు ఆదిత్య డిగ్రీ, పీజీ కళాశాలల అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ బి.ఈ.వి.ఎల్. నాయుడు తెలిపారు.ప్రార్థనా గీతంతో ప్రారంభమైన ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన డాక్టర్ బి.ఈ.వి.ఎల్. నాయుడు మాట్లాడుతూ, విద్యా సంస్కృతి అంశాలతో పాటు క్రీడలకు కూడా ఆదిత్య విద్యాసంస్థలు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నాయని పేర్కొన్నారు. చెస్ ఆట విద్యార్థులలో లాజికల్ మరియు గణితపరమైన ఆలోచనా శక్తిని పెంపొందిస్తుందని తెలిపారు. పోటీల్లో పాల్గొనడానికి విచ్చేసిన విద్యార్థులను అభినందించారు.ముఖ్యఅతిథిగా విచ్చేసిన రాష్ట్ర చెస్ ఫెడరేషన్ మాజీ చైర్మన్, ఆంధ్రప్రదేశ్ ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ వై.డి. రామారావు మాట్లాడుతూ, చదరంగం మనోబలాన్ని పెంపొందించే అత్యంత శక్తివంతమైన ఆట అని పేర్కొన్నారు. విద్యార్థులు చదువుతోపాటు క్రీడలలోనూ రాణించి దేశానికి మంచి పేరు తీసుకురావాలని సూచించారు. చెస్ ఫెడరేషన్ చైర్మన్‌గా తన అనుభవాలను పంచుకున్నారు. అనంతరం చదరంగపు పావులను కదిలించి పోటీలను ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఆదికవి నన్నయ యూనివర్సిటీ స్పోర్ట్స్ బోర్డ్ అసిస్టెంట్ సెక్రటరీ డాక్టర్ ఎం.వి.ఎస్.ఎస్.ఎన్. మూర్తి విద్యార్థులకు అభినందనలు తెలియజేసి, ఎంపిక విధానం మరియు క్రీడా నియమాలను వివరించారు.

ఈ కార్యక్రమంలో భీమవరం బీవీ రాజు కళాశాల ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ జి.వి. పవన్ కుమార్ రాజు, ఆర్బిటర్ జి.వి. కుమార్, ఆదిత్య డిగ్రీ మరియు పీజీ కళాశాలల ఫిజికల్ డైరెక్టర్ పి.సత్యవతి, వివిధ కళాశాలల ఫిజికల్ డైరెక్టర్లు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.ఈ పోటీలను విజయవంతంగానిర్వహించిన క్రీడా విభాగాన్ని ఆదిత్య విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ నల్లమిల్లి శేషారెడ్డి, డిగ్రీ కళాశాలల సెక్రటరీ డాక్టర్ నల్లమిల్లి సుగుణారెడ్డి, డైరెక్టర్ డాక్టర్ నాయుడు అభినందించారు.




# ఉపాధి కూలీలకు కనీస సౌకర్యాలు కరువు
## సామాజిక తనిఖీ గ్రామ సభలో కూలీల ఆవేదన



**కాట్రేనికోన పెన్ పవర్ ఫిబ్రవరి 12:**మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిర్వహణ విమర్శలకు దారితీస్తోంది. కాట్రేనికోన గ్రామ సచివాలయం వద్ద గురువారం సర్పంచ్ గంటి వెంకట సుధాకర్ అధ్యక్షతన సామాజిక తనిఖీ గ్రామ సభ జరిగింది. ఈ సందర్భంగా స్థానిక ఉపాధి పనులపై పలువురు అసంతృప్తి వ్యక్తం చేశారు. గ్రామ సభ జరుగుతున్నట్లు ఎవరికీ తెలియదని అన్నారు. పనుల్లో జవాబుదారీతనం, పారదర్శకత కరువైందన్నారు. ఉపాధి పనులు చేసే ప్రదేశాలలో కనీసం మంచినీరు సౌకర్యం కల్పించడం లేదని, నీడ లేదని,ప్రమాదాలు జరిగితే ప్రథమ చికిత్స సౌకర్యాలు కూడా లేవని ఉపాధి కూలీల ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో మండల స్థాయి ఉపాధి సిబ్బంది కూలీలకు కనీస సౌకర్యాలు కల్పించే వారని ప్రస్తుతం నిర్లక్ష్యంగా పట్టించుకోవడంలేదని వారు ఆరోపించారు. గ్రామసభను మొక్కుబడి తంతు గా నిర్వహించారని స్థానికులు ఆరోపించారు. ఈ సామాజిక తనిఖీ గ్రామ సభలో కొందరు ఉపాధి కూలీలు తప్ప, స్థానిక గ్రామ ప్రజలు లేకపోవడం పట్ల నిరసన వ్యక్తంమైంది.పంచాయతీ కార్యదర్శి జె వి వి సత్యనారాయణ, మండల ఉపాధి ఏపీవో చంద్రమోహన్ ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# డిప్యూటీ సీఎం సూచనల మేరకు ఇంటి పట్టా అందజేత



**కాకినాడ/పిఠాపురం పెన్ పవర్, ఫిబ్రవరి 12:**డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ సూచనల మేరకు, జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సగిలి ఆదేశాలతో గురువారం సాయంత్రం పిఠాపురం తహసీల్దార్ కార్యాలయంలో ఎమ్మార్వో గోపాలకృష్ణ చేతుల మీదుగా చిన్నారులు కరణం సత్య, చంటి లకు ఇంటి పట్టాను అధికారికంగా అందజేశారు.

# సిఐటియు ఆధ్వర్యంలో డిమాండ్లు అమలు చేయాలని నిరసన



**అంబాజీపేట, పెన్ పవర్, ఫిబ్రవరి 12:**కనీస వేతనాలు 26వేలు ఇవ్వాలి, రిటైర్మెంట్ బెనిఫిట్స్ అంగనవాడికి ఆశ వర్కర్స్ కి అమలు చేయాలని పలు డిమాండ్ లతో నిరసనలు చెరసారు. దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను మండలం లో సిఐటియు మండల కన్వీనర్ బి. ఎస్తేరురాణి ఆధ్వర్యంలో

అంగన్వాడి ఆశ మిడ్డేమీలు, వివోఏలు భవన నిర్మాణ కార్మికులు ఇతర సిబ్బంది పాల్గొన్నారు. ఉపాధి హామీ కూలీలు ఇంకా అనేక రంగాలు పాల్గొని ధర్నాను జయప్రదం చేశారు. డిమాండ్స్ నాలుగు లేబర్ కోట్స్ ను వెంటనే రద్దు చేయాలి కార్మికులకు సమ్మెలో ధర్నాలు చేసుకునే హక్కును అమలు చేయాలి కనీస వేతనాలు 26వేలు ఇవ్వాలి, రిటైర్మెంట్ బెనిఫిట్స్ అంగనవాడికి ఆశ వర్కర్స్ కి అమలు చేయాలి, అన్ని రంగాలకు కనీస వేతనం 26,వేలు ఇవ్వాలని డిమాండ్ చేసారు. స్థానిక సెంటర్ కు ర్యాలీగా చేరుకొన్నారు. గుజరాత్ సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు గ్రాట్యుటీ అమలుచేయాలి. అంగన్వాడీలను,ఆశలను గ్రేడ్ 3 ఉద్యోగులుగా గుర్తించాలని నినాదాలతో ర్యాలీ సాగింది. ఈ కార్యక్రమం లో అంగన్వాడీ ఎం. వెంకటలక్ష్మి ఆర్ దుర్గా మహేశ్వరీ, ఆర్ దుర్గా మల్లేశ్వరి, జి వెంకటలక్ష్మి, ఆశ వర్కర్స్. ఈ మేరీ ప్రమీల, డి స్వరూప రాణి, డ్వాక్రా విఓలు భారతి, వి. జ్యోతి, వ్యవసాయ కూలీల నాయకులు ఆర్. వెంకట్రావు, భవన నిర్మాణ నాయకులు జి. వెంకటేశ్వరరావు మిడ్ మీల్ కార్మికులు పాల్గొన్నారు.

# సార్వత్రిక సమ్మెతో దద్దరిల్లిన గండేపల్లి
## దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె విజయవంతం......





**గండేపల్లి, పెన్ పవర్, ఫిబ్రవరి ,12:**గండేపల్లి సీఐటీయూ ఆధ్వర్యంలో సీఐటీయూ మండల అధ్యక్షులు వై.శ్రీనివాసరెడ్డి.కార్యదర్శి నొక్కులలిత ఆధ్వర్యంలో మండల తహసీల్దార్ కార్యలయం వద్ద సమ్మె నిర్వహించి తహసీల్దార్ శ్రీనివాస్ కి డిమాండ్స్ నోటీస్ అందించారు కార్మికులకు నష్టదాయకమైన 4 లేబర్ కోడ్ లు రద్దు చేయాలని. కనిసవేతనం 26000 చెల్లించాలని స్కీం వర్కర్స్ ఐన అంగన్వాడీ .ఆశా . మిడ్ డే మీల్స్ తదితర పథకాలు లో పనిచేస్తున్న వారికి ఉద్యోగ భద్రత కల్పించాలని.. 12గంటలు పని విధానాన్ని రద్దుచేయాలని. ఉపాధిహామీ పథకానికి బడ్జెట్ పెంచాలని .రైతు పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని.కాంటాక్ట్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల ను రెగ్యులర్ చేయాలని .సమనపనికి సమాన వేతనం చెల్లించాలని డిమాండ్ చేస్తూ .సమ్మె నిర్వహించి అనంతరం ర్యాలీ నిర్వహించి రాస్తారోకో చేశారు. ఈ సమ్మెలో భవన నిర్మాణ రంగం..అంగన్వాడీ ఆశా. నుండి వై వి రాజేశ్వరి..జ్యోతి.. వై వెంకటలక్ష్మి,శాంతి.విష్ణులక్ష్మి. మహేష్ .శ్రీను ..తాళ్లూరు..మల్లెపల్లి గ్రామలనుండి బిల్డింగ్ రంగాలభవన నిర్మాణం కార్మికులు తాళ్లూరు.వీరబాబు లక్ష్మీ చౌదరి
మల్లేపల్లి శ్రీను గారు వెంకన్నగారు
నీలాద్రిరావు పేట నారాయణదాసు శ్రీను . ప్రెసిడెంట్ సెక్రటరీ లు నుండి కార్మికులు పెద్ద సంఖ్యలో హాజరు అయ్యారు...ఈ సమ్మెకు మద్దతుగా యూ టి ఎఫ్ నుండి రమణ ఉన్నారు

# పిఠాపురంలో తల్లిదండ్రులను కోల్పోయిన చిన్నారులకు జిల్లా యంత్రాంగం బాసట

- డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు ఇంటి పట్టా మంజూరు
- జిల్లా కలెక్టర్ షణ్మోహన్



**కాకినాడ, ఫిబ్రవరి 12 ,పెన్ పవర్:**పిఠాపురం నియోజకవర్గం మాదాపూర్ గ్రామానికి చెందిన తల్లిదండ్రులను కోల్పోయిన ఇద్దరు చిన్నారులకు జిల్లా అధికార యంత్రాంగం అండగా నిలుస్తుందని జిల్లా కలెక్టర్ షణ్మోహన్ తెలిపారు. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ సూచనల మేరకు చిన్నారులకు సహాయం అందించేందుకు చర్యలు వేగవంతం చేసినట్లు పేర్కొన్నారు.

ఇటీవల అనాథలైన చిన్నారులు గురువారం కాకినాడ కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్‌ను కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ,డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఉదారతతో ప్రతి నెలా రూ. 5,000 చొప్పున ఆర్థిక సహాయం అందజేస్తున్నట్లు తెలిపారు. చిన్నారులు ధైర్యంగా ఉండాలని సూచించారు. వారికి శాశ్వత నివాసం కల్పించేందుకు జిల్లా యంత్రాంగం వెంటనే ఇంటి పట్టా మంజూరు చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఇంటి నిర్మాణ పనులు త్వరితగతిన ప్రారంభించేందుకు సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు చెప్పారు. పిల్లల విద్యాభ్యాసా నికి అవసరమైన అన్ని సదుపాయాలు కల్పించబడతాయని హామీ ఇచ్చారు. కలెక్టర్ ఆదేశాల మేరకు గురువారం సాయంత్రం పిఠాపురం తహసీల్దార్ కార్యాలయంలో ఎమ్మార్వో గోపాలకృష్ణ చేతుల మీదుగా చిన్నారులు కరణం సత్య, చంటి లకు ఇంటి పట్టాను అందజేశారు. ఈ కార్యక్రమంలో పిఠాపురం ఎంపీడీవో కే.స్వప్న, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# ఆంధ్రప్రదేశ్ స్టేట్ బార్ కౌన్సిల్ఎన్నికలు

**అమలాపురంలో సర్వం సిద్ధం**

**- ఎన్నికల అధికారి చింతపల్లి అజయ్ కుమార్**

**అమలాపురం/అంబాజీపేట, పెన్ పవర్, ఫిబ్రవరి 12:** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విభజన అనంతరం రెండోసారి అత్యంత ప్రతిష్టాత్మకంగా జరుగుతున్న ఆంధ్రప్రదేశ్ స్టేట్ బార్ కౌన్సిల్ ఎన్నికలకు రంగం సిద్ధమైంది. ఈనెల 13 న రాష్ట్రవ్యాప్తంగా ఈ ఎన్నికలు జరగనున్నాయి.

?పోటీలో 143 మంది అభ్యర్థులు

రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 23 బార్ కౌన్సిల్ సభ్యత్వ స్థానాల కోసం 143 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. అమలాపురం బార్ అసోసియేషన్ నందు నేడు ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ నిర్వహించనున్నట్లు అమలాపురం బార్ అసోసియేషన్ అధ్యక్షులు, ఎన్నికల అధికారి చింతపల్లి అజయ్ కుమార్ తెలిపారు. అమలాపురం బార్ అసోసియేషన్‌లో మొత్తం 306 మంది న్యాయవాదులు తమ ఓటు హక్కును వినియోగించు కోనున్నారు. ఈ సందర్భంగా ఎన్నికల అధికారి అజయ్ కుమార్ మాట్లాడుతూ.. ఓటు వేసే ప్రతి ఒక్కరూ కనీసం 5 ఓట్లను, గరిష్టంగా 23 ఓట్లను వేయాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. న్యాయవాదులందరూ ఎన్నికల నియమావళిని పాటిస్తూ, క్రమశిక్షణతో పాల్గొని తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఆయన కోరారు.

# డా. అడ్డాల సేవలకు జాతీయ స్థాయిలో గుర్తింపు రావడం ఆనందదాయకం: డా. వాడ్రేవు రవి



**కాకినాడ పెన్ పవర్, ఫిబ్రవరి 12:**కాకినాడలోని ఓ స్థానిక హోటల్‌లో ఏవన్ డయాగ్నోస్టిక్స్ అధినేత డా. వాడ్రేవు రవి అధ్యక్షతన, రేడియాలజిస్ట్ డా. వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో దంత వైద్యులకు సీబీసీటీ స్కాన్‌పై విద్యా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డా. వాడ్రేవు రవి మాట్లాడుతూ, గత రెండున్నర దశాబ్దాలుగా కాకినాడలో విశిష్ట సేవలు అందిస్తున్న డా. అడ్డాల సత్యనారాయణకు జాతీయ స్థాయిలో గుర్తింపు రావడం ఆనందదాయకమన్నారు. వైద్యులు తమ వృత్తి సేవలతో పాటు కొంత సమయాన్ని సమాజ సేవకు కేటాయించాలని సూచించారు. ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణంలో వైద్యులు వెన్నెముక వంటివారని, వారి సేవలను గౌరవించడం మరియు రక్షించడం మనందరి బాధ్యత అని తెలిపారు. డా. అడ్డాల సత్యనారాయణ మాట్లాడుతూ, "వైద్యో నారాయణో హరిః" అన్న సూత్రం ప్రకారం వైద్యుల సేవలు అసమానమైనవని పేర్కొన్నారు. ప్రాణాలను కాపాడే వైద్యుడిని దేవుడితో సమానంగా భావించే సంస్కృతి మనదని అన్నారు. తనకు లభించిన జాతీయ పురస్కారం కాకినాడ శాఖ దంత వైద్యుల సహకారంతోనే సాధ్యమైందని తెలిపారు. డా. వి.వి.రావు ఆధ్వర్యంలో అనేక సంక్షేమ కార్యక్రమాలు నిర్వహించామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో డా. హర్ష, డా. నాగేంద్ర, డా. రఘురామ్, డా. కృష్ణంరాజు, డా. చైతన్య, డా. వల్లి, డా. సిరాజ్, డా. ఆయేషా తదితరులు పాల్గొన్నారు.

# పవర్ లిఫ్టింగ్ విజేత ఆదిబాబుకు ఘన సన్మానం

**అమలాపురం/అంబాజీపేట, పెన్ పవర్, ఫిబ్రవరి 12:**వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ, నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ పట్టణ అభివృద్ధికి దోహదం చేస్తూనే, క్రీడా రంగంలో సైతం రాణిస్తున్న ఆశెట్టి ఆదిబాబు యువతకు ఆదర్శమని శ్రీదేవి ఉత్సవ కమిటీ అధ్యక్షులు గంగాబత్తుల రాంబాబు అన్నారు.

?ఇటీవల జరిగిన ఉభయగోదావరి జిల్లాల పవర్ లిఫ్టింగ్ పోటీల్లో బెంచ్ ప్రెస్ విభాగంలో బంగారు పతకం సాధించిన ఆదిబాబు దంపతులను స్థానిక శ్రీదేవి మార్కెట్‌లో, ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. పండితుల వేద మంత్రోచ్చారణ మధ్య దుశ్శాలువా, నూతన వస్త్రాలు, జ్ఞాపికలతో ఆదిబాబు దంపతులను గౌరవించారు. పలువురు ఉత్సవ కమిటీ సభ్యులు, వర్తకులు పూలమాలలతో సత్కరించి తమ అభిమానాన్ని చాటుకున్నారు.

తాను విజేతగా నిలిచిన నాటి నుంచి పలువురు మిత్రులు, పలు సంఘాలు, మహిళలు తనను అభినందించారని వారికి ప్రత్యేక కృతజ్ఞతలు ఆదిబాబు తెలిపారు. ఇక పై మీ అభిమానం ఎల్లప్పుడూ ఉండాలని ఈ సారి 110 కేజీ లు రికార్డు అధిగమించి మీ ముందుకు వస్తానని ఆదిబాబు అన్నారు.

ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు సలాది గోవిందు, ఆకుల నాగేశ్వరరావు, రేపాక సత్యనారాయణ, కొండేటి వెంకటేశ్వర రావు, మామిడిపల్లి రాంబాబు, కోకా నానిబాబు, వంటెద్దు గంగాద్రి, కుప్పాల రామకృష్ణ, గంగాబత్తుల దొరబాబు, కొర్లపాటి గణేష్ తదితరులు పాల్గొన్నారు.



## శని కృప కోసం మందపల్లిలో దివ్య కళ్యాణ మహోత్సవాల ఆధ్యాత్మిక వైభవం





**కొత్తపేట, పెన్ పవర్, ఫిబ్రవరి12;**ఉడాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా, కొత్తపేట మండలం, మందపల్లి గ్రామంలో వేంచేసి భక్తుల కోరికలను తీర్చే క్షేత్రపాలకుడిగా వెలసియున్న శ్రీ మందేశ్వర (శనేశ్వర) స్వామి వారి దేవస్థానంలో పిబ్రవరి 13 గురువారం నుండి 18 బుధవారం వరకు శ్రీ ఉమా మందేశ్వర స్వామి, శ్రీ ఉమా బ్రహ్మేశ్వర స్వామి, శ్రీ ఉమా నాగేశ్వర స్వామి వార్ల వార్షిక దివ్య కళ్యాణ మహోత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహించబడనున్నాయి. శని ప్రభావ నివారణకు ప్రసిద్ధిగాంచిన ఈ పుణ్యక్షేత్రంలో ప్రతి సంవత్సరం జరిగే కళ్యాణోత్సవాలు భక్తుల ఆధ్యాత్మిక ఉత్సాహాన్ని మరింత పెంపొందిస్తాయి. మహోత్సవాల ప్రారంభదినమైన ఫిబ్రవరి13 శు క్రవారం మధ్యాహ్నం 2 గంటల నుండి గ్రామోత్సవం మేళతాళాలు, వేదఘోషలు, భక్తిగీతాలు, వివిధ సాంస్కృతిక కార్యక్రమాల నడుమ ఘనంగా ఊరేగింపుగా సాగనుంది. సాయంత్రం ఆలయ ప్రాంగణం దీపాలంకరణలతో దివ్యంగా ముస్తాబై భక్తులతో కళకళలాడనుంది. అదే రోజు రాత్రి 10 గంటలకు శ్రీ స్వామి వార్ల, అమ్మవార్ల దివ్య కళ్యాణం దేవస్థానం అర్చకులు, వేదపండితులచే శాస్త్రోక్తంగా నిర్వహించబడుతుంది. ఫిబ్రవరి14 శనివారం శని త్రయోదశి పర్వదినం కావడం విశేషం. అదేవిధంగా ఫిబ్రవరి15 ఆదివారం మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా ప్రత్యేక పూజలు, అభిషేకాలు, రాత్రివేళ జాగరణ కార్యక్రమాలు నిర్వహించబడనున్నాయి. ఈ పర్వదినాలలో యావన్మంది భక్తులు శ్రీ స్వామివారికి తైలాభిషేకాలు నిర్వహించి, శనిదోష నివారణ కొరకు ప్రార్ధనలు చేసి, తీర్ధప్రసాదాలను స్వీకరించి పుణ్యఫలాన్ని పొందవలసినదిగా దేవస్థానం అధికారులు విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ మహోత్సవాలను విజయవంతం చేయుటకు ప్రింట్ ,ఎలక్ట్రానిక్ మీడియా మిత్రులు విస్తృత ప్రచారం చేయవలసిందిగా కార్యనిర్వహణాధికారి, సహాయ కమిషనరు దారపురెడ్డి సురేష్ బాబు కోరారు. భక్తులందరూ కుటుంబ సమేతంగా హాజరై శ్రీ మందేశ్వర స్వామి వారి అనుగ్రహం పొందవలసిందిగా దేవస్థానం తరఫున ఆయన ఆహ్వానం పలికారు.

## డొక్కా సీతమ్మ మధ్యాహ్న బడి భోజనం రుచికరంగా అందించాలి

- నిత్యావసర పంపిణీ సక్రమంగా అందించాలి
- జిల్లా పౌర సరఫరాల అధికారి అడపా ఉదయ భాస్కర్





**అమలాపురం,/అంబాజీపేట, పెన్ పవర్, ఫిబ్రవరి 12:**రేషన్ కార్డుదారులకు చౌక ధరల దుకాణాలను నిత్య వసర సరుకులు సమయా నికి అందేలా చర్యలు తీసుకొని ఆహార భద్రత చట్ట ప్రకారం నిత్యవసరాల పంపిణీ జవాబుదారీత నంతో నిర్వహించాలని జిల్లా పౌర సరఫరాల అధికారి అడపా ఉదయ భాస్కర్ డీలర్లకు సూచిం చారు. గురువారం ఆయన భీమన్నపల్లి చౌక ధరల దుకాణం నెంబర్ 12 ను తనిఖీ చేశారు మరియు అదే గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు డొక్కా సీతమ్మ మధ్యాహ్న బడి భోజనం వడ్డన ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన ప్రసంగిస్తూ డీలర్లు స్టాక్ రిజిస్టర్లు సక్రమంగా నిర్వహించకపోవడం గమనించడం జరిగిందని వెంటనే ఇకపై సక్రమంగా రికార్డులు సక్రమంగా నిర్వహించాలని లేని పక్షంలో చర్యలు తీసుకో వడం జరుగుతుందని హెచ్చరించారు. విక్రయాల నమోదులో లోపాలు నిర్దేశిత ధరల పట్టిక కొన్ని దుకాణాల్లో ప్రభుత్వం నిర్ణయించిన ధరల పట్టిక స్పష్టంగా ప్రదర్శించక పోవడం గమనించడం జరిగిందన్నారు. కొన్ని చోట్ల తూకం యంత్రాలు సరిగా పనిచేయక పోవడం వల్ల వినియోగదారులకు నష్టం కలిగే అవకాశం ఉన్నట్లు గుర్తించి సరి చేయించడం జరిగిందన్నారు. దుకాణాల్లో బయోమెట్రిక్ పద్ధతిలో సరుకుల పంపిణీ సక్రమంగా జరగకపోవడం గుర్తించి లోపాలపై సంబంధిత డీలర్లకు నోటీసులు జారీ చేస్తామని జిల్లా పౌర సరఫ రాల అధికారి తెలిపారు. నిబంధనలు పాటించని దుకాణాలపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్డుదారులకు ఏమైనా సమస్యలు ఉన్నట్లయితే క్యూఆర్ కోడ్ ద్వారా తెలియజేయవచ్చునన్నారు. నాణ్యమైన సరుకులు సమయానికి అందేలా చర్యలు తీసుకొని ఆహార భద్రత చట్ట ప్రకారం నిత్యవసరాల పంపిణీ జరగాలని సూచించారు. డొక్కా సీతమ్మ మధ్యాహ్న బడి భోజనం రుచికరంగా తాజాగా ఉంటుంది లేనిది విద్యార్థినీ విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. మెనూ ప్రకారం చిక్కి, రాగి జావా సరఫరా జరుగు తుంది లేనిది ఆరా తీశారు.

## ఈనెల 13న వీరభద్ర స్వామి వారి కళ్యాణం..



**అమలాపురం/అంబాజీపేట, పెన్ పవర్, ఫిబ్రవరి 12:**అమలాపురం రూరల్ మండలం ఇమ్మిడివరప్పాడు గ్రామంలో వేంచేసియున్న శ్రీ భద్రకాళి సమేత శ్రీ వీరభద్ర స్వామి వారి కళ్యాణం శుక్రవారం ఉదయం 10.45 నిమిషాలకు అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీ సభ్యులు అన్ని ఏర్పాట్లు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివార్ల దివ్య కళ్యాణాన్ని కనులారా తిలకించి స్వామివారి ఆశీస్సులు పొందాలని కమిటీ సభ్యులు కోరరారు.

## ప్రధాన మంత్రి జీవన్ జ్యోతి బీమా పథకం ద్వారా రూ.4 లక్షల చెక్కుల పంపిణీ

ఇద్దరు నామినీలకు యూనియన్ బ్యాంక్ ద్వారా ఆర్థిక సహాయం



**కాజులూరు, ఫిబ్రవరి 12 పెన్ పవర్:**కాజులూరు మండలం అంద్రంగి గ్రామంలో ప్రధాన మంత్రి జీవన్ జ్యోతి బీమా పథకం కింద ఇద్దరు నామినీలకు రూ.2 లక్షల చొప్పున మొత్తం రూ.4 లక్షల చెక్కులను గురువారం పంపిణీ చేశారు. అంద్రంగి గ్రామ సర్పంచ్ పెద్దిరెడ్డి నాగసుజాత ఆధ్వర్యంలో యూనియన్ బ్యాంక్ ద్వారా చెక్కులను అందజేశారు. అన్నమనీడి చంద్రకళ మరణం (మరణ తేదీ: 27-01-2026) నేపథ్యంలో ఆమె నామినీ అన్నమనీడి రామారావుకు రూ.2 లక్షలు అందజేశారు. అలాగే గిడ్ల సత్యనారాయణ మరణించగా, ఆయన నామినీ గిడ్ల దుర్గాదేవికి రూ.2 లక్షల చెక్కును అందించారు. ఈ సందర్భంగా సర్పంచ్ పెద్దిరెడ్డి నాగసుజాత మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న జీవన్ జ్యోతి బీమా పథకం వంటి పథకాలు కుటుంబాలకు ఆపద్భాందవంగా నిలుస్తున్నాయని తెలిపారు. ఉపసర్పంచ్ కొండేటి చక్రం కూడా పథకాల ప్రాముఖ్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ బ్యాంక్ మేనేజర్ దున్న సురేష్, తాతపూడి శేషరావు, ఎంపీటీసీ మట్టా సత్యనారాయణమ్మ ఆదినారాయణ, సిఎఫ్ఎల్ సిబ్బంది, గ్రామ కార్యకర్తలు పాల్గొన్నారు.

## వాహనదారులు నిబంధనలు పాటించాలి



**జగ్గంపేట, పెన్ పవర్, ఫిబ్రవరి 12: :** వాహనదారులు తప్పనిసరిగా నిబంధనలు పాటించాలని జగ్గంపేట ఎస్సై టి.రఘునాధరావు సూచించారు. గురువారం జగ్గంపేట సెంటర్ లో ఎస్సై రఘునాధరావు వాహనాలు తనిఖీ నిర్వహించారు. నిబంధనలు పాటించని పలువురికి జరిమానాలు విధించారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని, కారులో వెళ్లే డ్రైవర్లు సీటు బెల్టు ధరించాలన్నారు. రోడ్డు భద్రతా నియమాలు పాటించకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు.

## డ్రగ్స్ వద్దు జీవితమే ముద్దు

## పొగాకు, మాదక దావ్యాల వాడక వ్యతిరేక ర్యాలీ.




**అంబాజీపేట, పెన్ పవర్, ఫిబ్రవరి 12:**నషా ముక్త భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఈగిల్ క్లబ్ సభ్యులు, విద్యార్థులు, పోలీస్ శాఖ, వైద్య ఆరోగ్యశాఖల సమన్వయం తో మాదక ద్రవ్యాల (డ్రగ్స్) వాడక వ్యతిరేక ర్యాలీ ని గురువారం నిర్వహించారు. స్థానిక ప్రాదమిక ఆరోగ్యకేంద్ర వైద్యాదికారి

గీతమ విద్యార్థులకు డ్రగ్స్ వాడకం వల్ల మానవ జీవితాలకు ముప్పు వాటిల్లే ప్రకూదముందని అవగాన కల్పించారు. .అంబాజీపేట సబ్ ఇన్స్పెక్టర్ చిరంజీవి మాట్లాడుతూ డ్రగ్స్ వద్దు జీవితమే ముద్దు అని విద్యార్థులు భావితరాలకు ఆదర్శంగా ఉండాలని విద్యతోనే భవిష్యత్తు అత్యున్నత స్థాయిలో నిలుస్తారని సూచించారు. చెడు అలువాట్లకు లోనికావద్దని మాదక ద్రవ్య చట్టాలు శిక్షలు గూర్చి వివరించారు. అనంతరం ప్లకార్డులతో ఉన్నత పాఠశాల నుండి అంబాజీపేట సెంటర్ వరకూ ర్యాలీ నిర్వహించారు. కూడలి వద్ద మానవహారంగా ఏర్పడి డ్రగ్స్ .

వాడక వ్యతిరేక నినాదాలు చేసారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె. సాయిరామ్, పాఠశాల ఈగిల్

క్లబ్ కన్వీనర్ కె. ఆదిలక్ష్మి, వైద్య ఆరోగ్య సిబ్బంది, పి.ఇ.టి ఉమామహేశ్వరరావు, వివిధ పాఠశాలల ఈగిల్ క్లబ్

కన్వీనర్లు, ఉపాధ్యాయులు, సి.ఆర్.యమ్.టి లు పాల్గొన్నారు.

## కల్తీ, నకిలీ అంతా కూటమి నేతల్లోనే



**జగ్గంపేట, పెన్ పవర్, ఫిబ్రవరి 12:** తిరుమల తిరుపతి లడ్డులో కల్తీ లేదని విచారణ సంస్థలు చెప్పడాన్ని కూటమి నేతలు తట్టుకోలేక పోతున్నారని కల్తీ అంతా కూటమి నేతల్లోనే ఉంది తప్ప లడ్డులో కాదని తోట నరసింహం విమర్శించారు. ప్రపంచ వ్యాప్తంగా శ్రీ వెంకటేశ్వర స్వామి భక్తుల మనోభావాలను దెబ్బతీసే విధంగా కూటమి నేతల ప్రవర్తిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. హిందువుల పట్ల కూటమి నేతలకు కనీస గౌరవం లేదని తమ తప్పులను కప్పుపుచ్చుకోవడానికి చంద్రబాబు అండ్ కో ఎంతకైన దిగజారతారని విమర్శించారు. చంద్రబాబు అధికారంలో ఉన్నప్పుడు ముఖ్య పుణ్యక్షేత్రాలలో ప్రమాదాలు జరగడం భక్తులు మరణించడం లాంటి అనేక సంఘటనలు జరిగిన ఈ కూటమి ప్రభుత్వం పట్టించుకోలేదని దుయ్యబట్టారు. శ్రీశైలం శివమాల మాల ధరించి, ఎంతో నిష్టతో దీక్ష చేసి వచ్చిన శివ స్వాములకు సౌకర్యాలు కల్పించలేక వారిపై లాఠీ చార్జీలు చేసిన దుర్మార్గపు ప్రభుత్వం ఏదైనా ఉందంటే కూటమి ప్రభుత్వమని విమర్శించారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీని మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డిని ప్రజలకు, ముఖ్యంగా హిందువులకు దూరం చేయాలని చంద్రబాబు చేసిన కుట్ర రాష్ట్ర వ్యాప్తంగా, ప్రపంచ వ్యాప్తంగా శ్రీవారు భక్తులకు అర్ధమైందని అన్నారు. వైజాగ్ లో ఆలయం కట్టిన, మారుమూల మన్యం ప్రాంతాలలో ఆలయాలు కట్టిన, విదేశాలలో ఆలయాలు కట్టిన అది వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడే జరిగిందని తోట నరసింహం అన్నారు. కక్ష పూరిత రాజకీయాల్లో భాగంగా సీనియర్ నాయకులు మాజీ మంత్రి అంబటి రాంబాబుపై అక్రమ కేసులు బనాయించి రాజమండ్రి సెంట్రల్ జైల్లో పెట్టారని ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారని అన్నారు. అదేవిధంగా జోగి రమేష్ ఇంటిపై పెట్రోలు బాంబులతో దాడి చేసి గుండాలు వలె ప్రవర్తించారని దుయ్యబట్టారు. ఈ కార్యక్రమంలో జగ్గంపేట మండలం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రావుల గణేష్ రాజా, గోకవరం మండల పార్టీ అధ్యక్షులు పాటి రాంబాబు, కాకినాడ జిల్లా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు రామకుర్తి శ్రీరామచంద్రమూర్తి, జగ్గంపేట నియోజకవర్గం వాణిజ్య విభాగం అధ్యక్షులు కరటూరి వీర్రాజు, రాజుపూడి ఎంపీటీసీ నంగన నాని, రాజపూడి గ్రామ పార్టీ అధ్యక్షులు పూనిశెట్టి శ్రీను, ఎక్స్ ఎం పి టి సి శ్రీను, ధనిశెట్టి వరప్రసాద్, తదితర వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at printed at SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS FLAT NO: 504, Bharat Towers, 5th lane, Dwaraka Nagar, Visakhaptanam, Andhrapradesh-530016, and published at Flat No F2, Nihar towers, Srinagar, kakinada, kakinada District-533003
Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/2017/73154 , editorpenpower@gmail.com

# ఏపీ పరిస్థితి ఇంత దారుణమా...

**గుంటూరు, ఫిబ్రవరి 12, పెన్ పవర్:** ఆంధ్రప్రదేశ్‌లో బుధవారం నుంచి అసెంబ్లీ సమావేశాలు ప్రారంభం అయ్యాయి. అయితే ఇంతలో కేంద్రం పార్లమెంట్‌లో పెట్టిన ఓ నివేదిక ఇక్కడ రాజకీయ చిచ్చు రేపింది. ఆంధ్రప్రదేశ్‌లోని రైతు అప్పుల ఊబిలో ఉన్నాడని చెప్పిన రిపోర్టు సంచలనంగా మారుతోంది. అయితే దీన్ని అధికార ప్రతిపక్షాలు ఇరువురు కూడా బురద చల్లేలా ఉందని విశ్లేషకులు చెబుతున్నారు. దేశానికి వెన్నెముక రైతు అని గర్వంగా చెప్పుకునే రైతు అప్పుల భారతంతో కుంగిపోతున్నాడని పార్లమెంట్‌లో కేంద్రం కీలక నివేదిక బయటపెట్టింది. ఆంధ్రప్రదేశ్‌లోని రైతు కుటుంబాలు దేశంలోనే అత్యధిక అప్పుల భారంతో ఉన్నాయనేది చేదు నిజం. కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన తాజా గణాంకాలు చూస్తుంటే ఏపీలో రైతు దీనస్థితి ఏంటో కళ్లకు కట్టినట్టు కనిపిస్తోంది. ఫిబ్రవరి 10న లోక్‌సభలో ఏపీ రైతు అప్పులపై ఒక కీలక చర్చ జరిగింది. దీనిపై కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ లిఖిత పూర్వక సమాధానం ఇచ్చారు. ఈ ప్రకటన ద్వారా ఆంధ్రప్రదేశ్‌లో రైతులు ఎంతటి ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నారో దేశానికి స్పష్టమైంది. ప్రభుత్వ లెక్కల ప్రకారం దేశవ్యాప్తంగా ఉన్న రైతులతో పోలిస్తే ఆంధ్రప్రదేశ్ రైతుల అప్పులే అత్యధికంగా ఉన్నట్టు తేలింది. మంత్రి శివరాజ్ సింగ్ వెల్లడించిన గణాంకాల ప్రకారం జులై 2018–జూన్ 2019 మధ్య కాలానికి సంబంధించి ఆంధ్రప్రదేశ్‌లోని ఒక సగటు రైతు కుటుంబం అప్పు 2,35, 554 రూపాయలుగా ఉంది. ఇది కేవలం ఒక అంచనా మాత్రమే కాదు. ప్రభుత్వ రికార్డుల్లో నమోదైన వాస్తవం. అంటే మన రాష్ట్రంలో ఒక సాధారణ రైతు కుటుంబం సుమారు రెండు లక్షల ముప్పై ఐదు వేల రూపాయల అప్పుతో కాలం వెళ్లదీస్తోంది. పక్కనే ఉన్న తెలుగు రాష్ట్రం తెలంగాణతో పోల్చి చూసినా ఏపీ పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. తెలంగాణలో ఒక రైతు కుటుంబం సగటు అప్పు 1,52, 113రూపాయలుగా ఉంది. అంటే ఏపీ కంటే ఇది చాలా తక్కువ. భారత్‌లో మొత్తం మీద ఒక రైతు కుటుంబం సగటు అప్పు కేవలం 74, 121 రూపాయలు మాత్రమే. జాతీయ సగటు 74వేలు ఉంటే ఏపీలో అది 2.35 లక్షలకు చేరడం ఆందోళనకరంగా ఉంది. దేశ సగటు కంటే ఏపీలో రైతులు దాదాపు మూడు రెట్లు ఎక్కువ అప్పుల్లో ఉన్నారని లెక్కలు చెబుతున్నాయి.

కేంద్ర మంత్రి ప్రకటన

ద్వారా అప్పుల భారం అయితే తెలిసింది కానీ, సామాన్యంగా రైతుకు ఈ తిప్పలు ఎందుకు వస్తాయో అందరికి తెలిసిందే. పెట్టుబడి పెరగడం, గిట్టుబాటు ధర లేకపోవడం, ప్రకృతి వైపరీత్యాలు వంటి ఎన్నో కారణాలు రైతును అప్పుల వైపు నెడుతున్నాయి. ఒక్కో రైతు కుటుంబంపై ఇంత భారీ స్థాయిలో అప్పు ఉండటం అనేది రాష్ట్ర ఆర్థిక వ్యవస్థపై కూడా ప్రభావం చూపుతుంది. పార్లమెంట్ సాక్షిగా బయటపడిన ఈ లెక్కలు ఇటు టీడీపీపై వైసీపీ దుమ్మెత్తి పోస్తుంటే, వారి హయాంలోనే ఇలాంటి లెక్కలు వెలుగు చూశాయని అప్పటి ప్రభుత్వం చేతకానితనం వల్లే ఇదంతా జరిగిందని కూటమి నేతలు ఆరోపిస్తున్నారు. మొత్తానికి ఈ కేంద్ర విడుదల చేసిన లెక్కలను ఇరు వర్గాలు వాడుకుంటున్నారు.

03
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
'పొ. 12 సెం.మీ, వె. 8 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

## రాజ్యసభకు చింతకాయల విజయ్...

**శ్రీకాకుళం, ఫిబ్రవరి 12 పెన్ పవర్:** ఆంధ్రప్రదేశ్ నుండి జూన్‌లో ఖాళీ కాబోతున్న నాలుగు రాజ్యసభ స్థానాలపై తెలుగుదేశం పార్టీలో అప్పుడే చర్చ మొదలైంది. కూటమి ప్రభుత్వానికి ఉన్న బలం దృష్ట్యా ఈ నాలుగు సీట్లు సులువుగా దక్కే అవకాశం ఉండటంతో, అభ్యర్థుల ఎంపికపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కసరత్తు మొదలుపెట్టారు. ఈ రేసులో ప్రస్తుతం టీడీపీ ఐటీ వింగ్ బాధ్యతలు చూస్తున్న యువనేత చింతకాయల విజయ్ పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. ఆయనకు ఎంపీ సీటు దాదాపు ఖరారైనట్లు పార్టీ వర్గాల్లో బలమైన ప్రచారం సాగుతోంది. టీడీపీకి వెన్నెముకగా ఉండే బీసీ సామాజికవర్గానికి ప్రాధాన్యత ఇవ్వాలనేది అధిష్టానం ఆలోచన. ఉత్తరాంధ్రలో బలమైన బీసీ నేతగా, స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు వారసుడిగా విజయ్‌కు మంచి గుర్తింపు ఉంది. ఇప్పటికే అయ్యన్నపాత్రుడు అసెంబ్లీ స్పీకర్‌గా గౌరవప్రదమైన హోదాలో ఉండగా, ఆయన కుమారుడికి ఢిల్లీ స్థాయిలో అవకాశం కల్పించడం ద్వారా ఉత్తరాంధ్రలోని బీసీలకు పెద్దపీట వేసినట్లు అవుతుందని చంద్రబాబు భావిస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో టీడీపీ ఐటీ వింగ్‌పై అనేక కేసులు నమోదైనప్పుడు విజయ్ వెనకడుగు వేయకుండా పోరాడారు. పార్టీ సోషల్ మీడియా సైనికులకు అండగా నిలవడమే కాకుండా, ప్రభుత్వంపై నిరంతరం డిజిటల్ అస్త్రాలను సంధించారు. ఈ క్రమంలో ఆయన అనేక రాజకీయ ఇబ్బందులను ఎదుర్కొన్నారు. పార్టీ కోసం ఆయన పడిన కష్టానికి ప్రతిఫలంగా ఈ గౌరవం దక్కాలని మెజారిటీ నేతలు అభిప్రాయపడుతున్నారు. పార్టీ పట్ల ఆయనకున్న నిబద్ధత చంద్రబాబు దృష్టిలో కూడా విజయ్‌ను ప్రత్యేకంగా నిలబెట్టింది. పార్లమెంటులో పార్టీ వాణిని బలంగా వినిపించేందుకు చదువుకున్న, విషయ పరిజ్ఞానం ఉన్న యువతను పంపాలని చంద్రబాబు యోచిస్తున్నారు. విజయ్ విదేశాల్లో చదువుకోవడం, ఆధునిక సాంకేతికతపై అవగాహన ఉండటం, జాతీయ రాజకీయాల పట్ల ఆసక్తి కలిగి ఉండటం ఆయనకు అదనపు అర్హతలుగా మారాయి. ఢిల్లీ స్థాయిలో లాబీయింగ్ చేయడమే కాకుండా, రాష్ట్ర ప్రయోజనాల కోసం గొంతు వినిపించగల సత్తా విజయ్‌కు ఉందని పార్టీ పెద్దలు నమ్ముతున్నారు. అదే సమయంలో చింతకాయల విజయ్ అభ్యర్థిత్వానికి ఉన్న అతిపెద్ద ప్లస్ పాయింట్ నారా లోకేష్‌తో ఉన్న సాన్నిహిత్యం. పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు, ముఖ్యంగా లోకేష్ యువగళం పాదయాత్ర సమయంలో ఐటీ వింగ్ ద్వారా సోషల్ మీడియాలో పార్టీ గొంతుకను బలంగా వినిపించడంలో విజయ్ కీలక పాత్ర పోషించారు. లోకేష్ వ్యక్తిగత బృందంలో ఒకరిగా ఉంటూ, డిజిటల్ క్యాంపెయినింగ్‌ను విజయవంతంగా నడిపించడమే కాకుండా, పార్టీ కేడర్‌ను సమన్వయం చేయడంలో తన సామర్థ్యాన్ని నిరూపించుకున్నారు. ఈ విధేయతే ఆయనను రేసులో ముందు నిలబెడుతోందని టీడీపీ వర్గాలుచెబుతున్నాయి. ప్రస్తుతానికి అధికారికంగా ఎటువంటి ప్రకటనా రానప్పటికీ, విజయ్ పేరుపై చంద్రబాబు , లోకేష్ ఇప్పటికే ఒక ప్రాథమిక అవగాహనకు వచ్చినట్లు తెలుస్తోంది. పార్టీ సీనియర్లకు, యువతకు మధ్య సమతుల్యత దెబ్బతినకుండా ఈ ఎంపిక ఉండబోతోంది. అన్నీ అనుకూలిస్తే, రాజ్యసభలో టీడీపీ తరపున చింతకాయల విజయ్ అడుగు పెట్టడం ఖాయమని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

## ఒకేసారి నలుగురు మంత్రులకు బెదిరింపులు

**విజయవాడ,ఫిబ్రవరి 12 పెన్ పవర్:** అసెంబ్లీ సమావేశాల సమయంలో నలుగురు మంత్రులకు మావోయిస్టుల నుంచి బెదిరింపులు లేఖలు కలకలం రేపాయి. రాష్ట్ర మంత్రులు అనగాని సత్యప్రసాద్, కొల్లు రవీంద్ర, సత్య కుమార్ యాదవ్, కందుల దుర్గేష్‌లకు మావోయిస్టుల నుంచి బెదిరింపు లేఖలు వచ్చాయి. ఈ పరిణామంతో అప్రమత్తమైన నిఘా వర్గాలు విచారణ ప్రారంభించాయి. మావోయిస్టుల పేరిట వచ్చిన ఈ బెదిరింపు లేఖల వార్త చూసి తన కుటుంబ సభ్యులు తీవ్ర ఆందోళనకు గురయ్యారని, స్నేహితులు, శ్రేయోభిలాషుల నుంచి పెద్ద ఎత్తున ఫోన్లు వచ్చాయని మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. మావోయిస్టుల లేఖ అంశంపై మంత్రి కందుల దుర్గేష్ అసెంబ్లీ మీడియా పాయింట్‌లో చిట్‌చాట్ సందర్భంగా స్పందిస్తూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. తాను నిర్వహిస్తున్నది పర్యాటక శాఖ వంటి చిన్న శాఖ అని, తనకు మావోయిస్టులు లేఖలు రాయాల్సినంత పెద్ద వివాదాలు ఏముంటాయని ఆయన ప్రశ్నించారు. వ్యక్తిగతంగా గానీ, శాఖాపరంగా గానీ తాము ఎక్కడా ఎలాంటి తప్పులు చేయలేదని కందుల స్పష్టం చేశారు. సాధారణంగా మావోయిస్టుల నుంచి వచ్చే లేఖల శైలి ఇలా ఉండదని, ఎవరో కావాలని ఉద్దేశపూర్వకంగానే తప్పుడు లేఖలు సృష్టించి ఉంటారని మంత్రి అభిప్రాయపడ్డారు. ఈ బెదిరింపుల లేఖలపై మంత్రులు పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు సమాచారం. ఈ లేఖ వెనుక ఉన్న కుట్రను, అసలు కారకులను గుర్తించే పనిలో పోలీసులు ఉన్నారు. మంత్రుల భద్రతను పర్యవేక్షించే అధికారులు కూడా ఈ లేఖల అసలు మూలాలను ఆరా తీస్తున్నారు. కేవలం భయాందోళనలు సృష్టించేందుకే గుర్తుతెలియని వ్యక్తులు ఇటువంటి చర్యలకు పాల్పడి ఉండవచ్చని ప్రాథమికంగా భావిస్తున్నారు. మావోయిస్టుల లేఖలు వచ్చిన కారణంగా ఆ నలుగురు మంత్రుల నివాసాల వద్ద భద్రతను మరింత కట్టుదిట్టం చేశారు.

## వైసీపీ ధీమా లెక్కేంటీ...



**విశాఖపట్టణం ఫిబ్రవరి 12, పెన్ పవర్:** కేంద్ర ప్రభుత్వం జమిలి ఎన్నికలకు సిద్ధమవుతుంది. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా జమిలి ఎన్నికలు వస్తాయని, తెలంగాణ ఎన్నికలు 2029 లో జరుగుతాయని తెలిపారు. జనగణన తర్వాత నియోజకవర్గాల పునర్విభజన కూడా జరగనుంది. తెలంగాణ లో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 2029కి ఆరేళ్లవుతుంది. అయితే ఆంధ్రప్రదేశ్ లో శాసనసభకు ఎన్నికలు సకాలంలోనే జరుగుతాయి. 2024లో ఆంధ్రప్రదేశ్ శాసనసభకు ఎన్నికలు జరిగాయి. అంటే తిరిగి 2029లో శాసనసభ ఎన్నికలు జరగాల్సి ఉంది. జమిలి ఎన్నికలు ఒక ఏడాది ముందుగా వస్తాయని వైసీపీ తొలుత భావించింది. కానీ ఫ్యాన్ పార్టీ ఆశలపై కేంద్ర ప్రభుత్వం నీళ్లు చల్లినట్లయింది. ఆంధ్రప్రదేశ్ లో ఇప్పటికే రాజకీయాలు వేడెక్కాయి. తొలి నుంచి రాజకీయ వాతావరణం వేడి వేడిగానే కొనసాగుతుంది. జగన్ కు కూడా జమిలి ఎన్నికల సమాచారం తెలియడంతోనే ఏడాదిన్నర తర్వాత మాత్రమే పాదయాత్ర చేయాలని నిర్ణయించారంటున్నారు. 2029 ఎన్నికల్లో తిరిగి అధికారంలోకి రావడానికి 2027లో ఆయన పాదయాత్ర చేపట్టనున్నారు. తొలుత 2028 నాటికి జమిలి ఎన్నికలు వస్తాయని భావించినప్పటికీ కేంద్ర ప్రభుత్వం 2029 కే దేశ వ్యాప్తంగా ఎన్నికలు జరపాలని నిర్ణయించడంతో ఏపీలో మరో మూడేళ్లకు కాని ఎన్నికలు జరగవు. దీంతో అధికార తెలుగుదేశం పార్టీ సూపర్ సిక్స్ పథకాలను అమలు చేశాం కాబట్టి, మిగిలిన హామీలను కూడా నెరవేర్చి ఎన్నికలకు వెళ్లేలా ప్లాన్ చేస్తుంది. అమరావతి, పోలవరం పనులను పూర్తి చేస్తే ప్రజలు కూటమికి మరోసారి పట్టం కడతారని అంటున్నారు. గుజరాత్ తరహాలో వరసగా అధికారం ఇస్తేనే అభివృద్ధి సాధ్యమవుతుందన్న నినాదంతో కూటమి ఈసారి ఎన్నికలకు సిద్ధమవుతుంది. వైసీపీ మాత్రం కూటమి ప్రభుత్వంలో అవినీతి, సంక్షేమ పథకాలు అందరికీ చేరకపోవడంతో పాటు కక్ష పూరిత రాజకీయాలు, అక్రమ కేసులు వంటివి నినాదాలుగా వెళ్లాలనుకుంటుంది. కాంగ్రెస్ కు, కమ్యునిస్టులకు ఈసారి కూడా అవకాశం ఉండదు. వచ్చే ఎన్నికల్లోనూ కూటమి, వైసీపీ మధ్యనే ప్రధాన పోటీ ఉంటుందన్నది వాస్తవం. జమిలి ఎన్నికలు వస్తే ఏపీలో పెద్దగా తేడా ఉండదు. ఏపీలో ఎప్పటి నుంచో అసెంబ్లీ, పార్లమెంటుకు ఒకేసారి ఎన్నికలు జరుగుతున్నాయి. తెలంగాణలో మాత్రం ఒక ఏడాది ముందు శాసనసభ, తర్వాత పార్లమెంటు ఎన్నికలు జరుగుతాయి. జమిలి ఎన్నికల వల్ల ఏపీకి నష్టం లేదు. లాభం లేదు. మళ్లీ గెలవాలని టీడీపీ ప్రయత్నిస్తుంది. వైసీపీ గెలిచేందుకు సర్వశక్తుల ఒడ్డుతుంది.

## మోడీ చేతుల మీదుగా ప్రారంభం కానున్న స్టేషన్లు



**విజయవాడ, ఫిబ్రవరి 12, పెన్ పవర్:** ఏపీలో అమృత్ భారత్ స్కీమ్‌లో 73 రైల్వే స్టేషన్‌లను 3418 కోట్ల రూపాయలతో పూర్తిగా అధునీకరిస్తున్నారు వాటిలో విజయవాడ పరిధిలో 21 స్టేషన్‌లు ఉన్నాయి. కొన్ని ముఖ్యమైన రైల్వే స్టేషన్‌ల పనులు పూర్తి అయ్యాయి. త్వరలోనే దేశవ్యాప్తంగా రెడీ అయిన రైల్వే స్టేషన్‌లను ప్రధాని మోదీ ఒకేసారి ప్రారంభించనున్నారు. వాటిలో విజయవాడ డివిజన్ పరిధిలో 4 స్టేషన్‌లు ఉన్నాయి. అవే రాయనపాడు, నిడదవోలు,కాకినాడ టౌన్,తుని.

**1) రాయనపాడు రైల్వే స్టేషన్**

విజయవాడ స్టేషన్‌కు సాటిలైట్ స్టాప్‌గా ఏర్పడిన రాయనపాడు ఇప్పుడు పూర్తిగా రూపం మార్చుకుంది. కొన్ని విషయాల్లో విజయవాడ స్టేషన్ కంటే అందంగా ముస్తాబైంది. విజయవాడ స్టేషన్‌పై భారం తగ్గించేందుకు ఏర్పడిన రాయనపాడు పెరుగుతున్న విజయవాడ పరిధికి మరో స్టేషన్‌గా మారింది. ఇప్పటికే చాలా రైళ్లు విజయవాడ మెయిన్ స్టేషన్‌కు వెళ్లనవసరం లేకుండా గుణదల నుంచి రాయనపాడు లైన్‌లో ఖమ్మం రూట్‌లోకి వెళ్లిపోతున్నాయి. ఇలాంటి ట్రైన్స్‌కి రాయన పాడులో హాల్ట్ ఇస్తున్నారు. సికింద్రాబాద్‌కు చర్లపల్లి ఎలానో విజయవాడకు రాయనపాడు అలాంటిదే. ప్రస్తుతం ఈ స్టేషన్ చూడడానికి చాలా అద్భుతంగా ఉంది.

**2) నిడదవోలు రైల్వే స్టేషన్**

గోదావరి జిల్లాల్లో అతి ముఖ్యమైన రైల్వే జంక్షన్ ఇది. చెన్నై–హౌరా మెయిన్ లైన్‌లో ఈ స్టేషన్ ఉంటుంది. ఇక్కడి నుంచి తణుకు, భీమవరం, నరసాపురం, గుడివాడ, మచిలీపట్నం మీదుగా విజయవాడ వెళ్లే మరో రూట్ ఉండడం వల్ల ఈ స్టేషన్‌ను డెవలప్ చెయ్యడానికి రైల్వే డిసైడ్ అయి ఏకంగా 30 కోట్లు కేటాయించింది. ఇంతకు ముందు కేవలం 3 ప్లాట్ ఫామ్స్ ఉంటే ఇప్పుడు వాటి సంఖ్య 5కు చేరుకుంది. వెయ్యేళ్ల చరిత్ర ఉన్న పట్టణం కావడంతో నిడదవోలు చారిత్రకంగా, ఆధ్యాత్మికంగా, సాంస్కృతికపరంగా, టూరిజంపరంగా చాలా ముఖ్యమైన ఏరియా. రానున్న గోదావరి పుష్కరాలను కూడా దృష్టిలో పెట్టుకుని రాజమండ్రికి దగ్గరలో గల ఈ స్టేషన్‌ను డెవలప్ చేశారు. ముఖ్యంగా ఈ స్టేషన్‌లో కొత్తగా ఏర్పాటు చేసిన లిఫ్ట్, ఎస్కలేటర్ ప్రయాణికులకు చాలా సౌకర్యంగా మారాయి.

**3) కాకినాడ టౌన్ స్టేషన్**

కాకినాడ టౌన్ రైల్వే స్టేషన్ ప్రస్తుత రూపం చూస్తే ఎవరైనా అవాక్కవ్వాల్సిందే. దీని రూపం ఎంతెలా మారింది అంటే రైల్వే కూడా ఈ స్టేషన్ డెవలప్మెంటను ప్రమోట్ చేసుకొంటోంది. కాకినాడలోని పారిశ్రామిక ప్రాంతాలను దేశంలోని ఇతర పట్టణాలతో కలిపే కాకినాడ టౌన్ స్టేషన్ విజయవాడ డివిజన్‌లో చాలా ముఖ్యమైంది. కాకినాడలో రెండు రైల్వే స్టేషన్‌లు ఉన్నాయి. కాకినాడ పోర్ట్, కాకినాడ టౌన్. వీటిలో కాకినాడ టౌన్ స్టేషన్ నుంచే ప్రయాణికులు ఎక్కువగా రాకపోకలు సాగిస్తుంటారు. ఒకప్పుడు ఇక్కడ నుంచి రైళ్లు చాలా తక్కువగా వెళుతుండేవి. కానీ ఇప్పుడు వాటి సంఖ్య బాగా పెరిగింది. దానితో 21 కోట్ల ఖర్చుతో స్టేషన్‌ను బాగా డెవలప్ చేశారు. అందమైన మొక్కలు, కొత్త బెంచీలు, కుర్చీలు, అధునాతన టాయిలెట్స్, స్టేషన్ గోడలపై స్వాతంత్ర్య సమరయోధుల పెయింటింగ్స్ ఇలా చాలా సౌకర్యాలు వచ్చేశాయి.

**4) తుని రైల్వే స్టేషన్**

చారిత్రక పట్టణం తుని స్టేషన్‌ను 19.కోట్లతో డెవలప్ చేసింది రైల్వే శాఖ. స్వాతంత్ర్య సమరయోధుడు అల్లూరి సీతారామరాజు జ్ఞాపకాలతో ముడిపడిన తుని సమీపంలోని గిరిజన గ్రామాలకు చాలా ముఖ్యమైన రైల్వే స్టేషన్. అటు వైజాగ్ వెళ్లాలన్నా ఇటు కాకినాడ, విజయవాడ లాంటి టౌన్ వెళ్లాలన్నా ఈ స్టేషన్ ద్వారానే ప్రయాణం చేస్తారు. చాలా కాలం నుంచి అభివృద్ధికి నోచుకోని తుని స్టేషన్ ఇప్పుడు అదిరిపోయే లుక్‌లోకి మారిపోయింది. ముఖ్యంగా స్టేషన్ ఎంట్రీ ముఖద్వారాన్ని అద్భుతంగా తీర్చిదిద్దారు. అలానే స్టేషన్ లోపలి సౌకర్యాలను చక్కగా తీర్చిదిద్దారు.

# ఇక అమరావతి ఐటీ రాజధాని



**విజయవాడ, ఫిబ్రవరి 12, పెన్ పవర్:** హైదరాబాద్‌ను హైటెక్ సిటీ పేరుతో ఐటీ హబ్‌గా మార్చినట్టుగానే, ఇప్పుడు అమరావతిని ప్రపంచ దేశాలు అబ్బురపడేలా క్వాంటం కంప్యూటింగ్ హబ్‌గా మార్చేందుకు ఆంధ్రప్రదేశ్ అడుగులు వేస్తోంది. ఇది రాష్ట్ర చరిత్రలోనే మైలురాయిగా భావిస్తున్నారు. ఇది కేవలం టెక్ పార్క్ మాత్రమే కాదని రాబోయే తరాల భవిష్యత్‌ను మార్చే విజన్‌గా ప్రభుత్వం అభివర్ణిస్తోంది. మనం వాడుతున్న కంప్యూటర్లు, ఫోన్లు, బిట్స్ ఆధారంగా పని చేస్తాయి. అంటే చిన్నప్పుడు మీరు నేర్చుకున్న ద్విసంఖ్యామానం గుర్తుందా... అంటే ఎంత పెద్ద సంఖ్యలనైనా 0,1 రూపంలో రాయడం. వీటి ఆధారంగానే ఇప్పటి వరకు కంప్యూటర్, ల్యాప్‌టాప్, ఫోన్ పని చేస్తూ వచ్చాయి. ఇప్పుడు క్వాంటం కంప్యూటర్‌లో అలా కాదు. ఇక్కడ క్యూబిట్స్ ఆధారంగా పని చేస్తాయి. వీటి ప్రత్యేకత ఏంటంటే ఇవి ఒకే సమయంలో 0, 1 రెండూ అవ్వగలవు. దీన్నే సూపర్‌పొజిషన్ అంటారు. దీని వల్ల మామూలు కంప్యూటర్లు కొన్ని ఏళ్లు పని చేసే పనిని, క్వాంటం కంప్యూటర్లు కేవలం సెకన్లలో పూర్తి చేస్తాయి. ముఖ్యంగా మందుల తయారీ, వాతావరణ అంచనాలు, సైబర్ సెక్యూరిటీ వంటి రంగాల్లో ఇది విప్లవాత్మక మార్పులు తీసుకురానుంది. క్వాంటం కంప్యూటర్ ప్రాజెక్టు కోసం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఐబీఎం, టీసీఎస్, ఎల్ అండ్ టీ వంటి ప్రపంచ స్థాయి కంపెనీలో చేతులు కలిపింది. అమరావతిలో సుమారు యాభై ఎకరాల్లో ఈ వ్యాలీని ఏర్పాటు చేస్తున్నారు. ఇక్కడ ఐబీఎం క్వాంటం సిస్టమ్ 2 అనే భారీ కంప్యూటర్‌ను ఏర్పాటు చేయనున్నారు. ఇందులో 156 క్యూబిక్ హెరా ప్రాసెసర్‌ను వాడుతున్నారు. ఇది మన దేశంలోని అతి పెద్ద క్వాంటం కంప్యూటర్ కానుంది. ఈ వ్యాలీ కేవలం కంప్యూటర్లకే పరిమితం కాదు, ఇక్కడ హార్డ్‌వేర్ తయారీ, సాఫ్ట్‌వేర్ అభివృద్ధి, స్కిల్ ట్రైనింగ్ వంటివన్నీ ఒకే చోట ఉంటాయి. 2029 నాటికి దాదాపు ఒక బిలియన్ డాలర్ల పెట్టుబడులను ఆకర్షించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది.

**నిరుద్యోగులకు విద్యార్థులకు కలిగే ప్రయోజనం ఏంటీ?**

ఈ ప్రాజెక్టు వల్ల ఆంధ్రప్రదేశ్‌లో భారీగా ఉద్యోగ అవకాశాలు వస్తాయని చెబుతున్నారు. దాదాపు లక్ష హై స్కిల్ ఉద్యోగాలు లభిస్తాయని అంచనా వేస్తున్నారు. ప్రభుత్వం కేవలం ఉద్యోగాలు ఇవ్వడమే కాదు, యువతకు శిక్షణ కూడా ఇవ్వబోతోంది. వన్ ఎంటర్‌ప్రెన్యూర్ పర్ ఫ్యామిలీ అనే విజన్‌తో సుమారు పది లక్షల మంది యువతకు క్వాంటం స్కిల్స్‌లో శిక్షణ ఇవ్వాలని ప్లాన్ చేశారు. ఇప్పటికే ఏపీఎస్ఎస్‌డీసీ సహకారంతో యాభై వేల మంది విద్యార్థులకు ట్రైనింగ్ ఇస్తున్నారు. దీని వల్ల మన రాష్ట్ర యువత విదేశాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా ఇక్కడే భారీ జీతాలతో ఉద్యోగాలు సంపాదించుకోవచ్చని ప్రభుత్వం చెబుతోంది. ఐఐటీ మద్రాస్, ఐఐటీ ఢిల్లీ వంటి సంస్థల భాగస్వామ్యంతో ఈ శిక్షణ కొనసాగుతోందని వెల్లడిస్తున్నారు.

**ప్రజల జీవితాల్లో వచ్చే మార్పులేంటి?**

2030 నాటికి దాదాపు ఐదు వేల కోట్ల విలువైన ఎగుమతులు చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. అమరావతి ఇండియాకే క్వాంటం క్యాపిటల్‌గా మారుతుందని చెబుతున్నారు. క్వాంటం కంప్యూటర్ల సహాయంతో క్యాన్సర్ వంటి వ్యాధులకు త్వరగా మందులు కనుగొనే అవకాశం ఉంది. వాతావరణాన్ని ముందే కచ్చితంగా అంచనా వేయడం ద్వారా రైతులకు పంటల విషయంలో ఎంతో లాభం కలుగుతుందని వివరిస్తున్నారు. ఆనలైన్ మోసాలు అరికట్టేందుకు కూడా సురక్షితమైన వ్యవస్థ తయారవుతుందని తెలుపుతున్నారు. దీనిపై మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ నాడు హైదరాబాద్‌ను ఐటీ రంగంలో ఎలాగైతే ముందు నిలిపారో, నేడు అమరావతిని డీప్‌టెక్ రంగంలో గ్లోబల్‌లీడర్‌గా చేయాలని చంద్రబాబు కంకణం కట్టుకున్నారని చెబుతున్నారు. ఆంధ్రప్రదేశ్ ఎవర్నీ ఫాలో అవ్వని అందరికీ దారి చూపిస్తుందని ఇప్పుడు అదే బాటలో ఉందని టీడీపీకి చెందిన సీనియర్ నేత ఒకరు కామెంట్ చేశారు. క్వాంటం టెక్నాలజీ అంటే చాలా ఖర్చుతో కూడుకున్న పని. ఈ కంప్యూటర్లు వేడెక్కకుండా ఉండటానికి భారీ స్థాయిలో కూలింగ్ సిస్టమ్ అవసరం. అయితే ప్రభుత్వం ఇప్పటికే వీటిన్నింటికీ ప్రణాళిక సిద్ధం చేసినట్టు చెబుతోంది. కేంద్రం చేపట్టిన నేషనల్ క్వాంటం మిషన్‌తో కలిసి రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తోంది.

# టీ20 వరల్డ్ కప్: సొంతగడ్డపై లంక జైత్రయాత్ర.. ఒమన్‌పై భారీ విజయం

**టీ20 ప్రపంచకప్‌లో ఆతిథ్య శ్రీలంకకు వరుసగా రెండో విజయం**

**ఒమన్‌తో జరిగిన మ్యాచ్‌లో 105 పరుగుల భారీ తేడాతో గెలుపు**

**లంక జట్టులో కుశాల్ మెండిస్, పవన్ రత్నాయకే, శనక హాఫ్ సెంచరీలు**

**ఒమన్ బ్యాటర్ మహమ్మద్ నదీమ్ ఒంటరి పోరాటం**




**హైదరాబాద్ పెన్ పవర్:** ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2026లో ఆతిథ్య శ్రీలంక జైత్రయాత్ర కొనసాగిస్తోంది. గ్రూప్-బిలో భాగంగా గురువారం ఒమన్‌తో జరిగిన మ్యాచ్‌లో 105 పరుగుల భారీ తేడాతో శ్రీలంక ఘనవిజయం సాధించింది. ఈ మెగా టోర్నీలో లంకకు ఇది వరుసగా రెండో గెలుపు కావడం విశేషం. బ్యాటింగ్, బౌలింగ్ విభాగాల్లో పూర్తి ఆధిపత్యం ప్రదర్శించి పసికూన ఒమన్‌ను చిత్తు చేసింది.పల్లెకెలె అంతర్జాతీయ స్టేడియంలో జరిగిన ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచిన ఒమన్ బౌలింగ్ ఎంచుకుంది. తొలుత బ్యాటింగ్ చేసిన శ్రీలంక నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 225 పరుగుల భారీ స్కోరు సాధించింది. లంక బ్యాటర్లు కుశాల్ మెండిస్ (45 బంతుల్లో 61), పవన్ రత్నాయకే (28 బంతుల్లో 60) అద్భుత అర్ధశతకాలతో రాణించారు. ఆఖర్లో కెప్టెన్ దసున్ శనక కేవలం 20 బంతుల్లోనే 2 ఫోర్లు, 5 సిక్సర్లతో 50 పరుగులు చేసి విధ్వంసం సృష్టించాడు.

అనంతరం 226 పరుగుల భారీ లక్ష్యఛేదనకు దిగిన ఒమన్ ఏ దశలోనూ పోటీ ఇవ్వలేకపోయింది. లంక బౌలర్ల కట్టుదిట్టమైన బౌలింగ్‌కు క్రమం తప్పకుండా వికెట్లు కోల్పోయి 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 120 పరుగులకే పరిమితమైంది. ఒమన్ జట్టులో మహమ్మద్ నదీమ్ (53 నాటౌట్) ఒక్కడే అర్ధశతకంతో ఒంటరి పోరాటం చేశాడు. శ్రీలంక బౌలర్లలో మహీశ్ తీక్షణ, దుష్మంత చమీర రెండేసి వికెట్లు పడగొట్టి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించారు. ఈ విజయంతో గ్రూప్-బిలో శ్రీలంక అగ్రస్థానానికి చేరింది.

# నమీబియా బ్యాటర్లకు చుక్కలే: బుమ్రా రెండో మ్యాచ్ ఆడటం కన్ఫామ్..!




**హైదరాబాద్ పెన్ పవర్:** ముంబై: టీ20 వరల్డ్ కప్‌లో భాగంగా అమెరికాతో జరిగిన తొలి మ్యాచ్‌కు భారత ఫాస్ట్ బౌలర్ జస్ప్రీత్ బుమ్రా దూరమైన సంగతి తెలిసిందే. తీవ్ర జ్వరం కారణంగా అతడు మ్యాచ్ ఆడలేదు. అయితే.. అనారోగ్యం నుంచి కోలుకున్న బుమ్రా గురువారం (ఫిబ్రవరి 12) అరుణ్ జైట్లీ స్టేడియంలో నమీబియాతో జరగనున్న రెండో మ్యాచులో బరిలోకి దిగనున్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో బుమ్రా హెల్త్ కండీషన్‌పై తిలక్ వర్మ క్లారిటీ ఇచ్చాడు. నమీబియాతో మ్యాచుకు ముందు జరిగిన ప్రీ-మ్యాచ్ ప్రెస్ కాన్ఫరెన్స్‌లో తిలక్ మాట్లాడుతూ.. బుమ్రా ఫిట్‌గా ఉన్నాడని తెలిపాడు. రెండో మ్యాచుకు అతడు అందుబాటులో ఉన్నాడని చెప్పాడు. తిలక్ వ్యాఖ్యలతో నమీబియాతో జరగనున్న రెండో మ్యాచులో బుమ్రా ఆడటం ఖాయమని స్పష్టమైంది. దీంతో భారత యార్కర్ కింగ్‌తో నమీబియా బ్యాటర్లకు చుక్కలు కనిపించడం ఖాయమంటున్నారు అభిమానులు. టీ20 వరల్డ్ కప్‌లో టీమిండియా రెండో మ్యాచ్‌కు రెడీ అయ్యింది. గురువారం జరిగే గ్రూప్ఎ లీగ్ మ్యాచ్‌లో పెద్దగా అనుభవం లేని నమీబియాతో తలపడనుంది. అయితే ఈ మ్యాచ్ తర్వాత పాకిస్తాన్‌తో హై ఓల్టేజ్ మ్యాచ్ ఉండటంతో ఇండియా బ్యాటర్లపై ప్రధానంగా దృష్టి నెలకొంది. అమెరికాతో జరిగిన తొలి మ్యాచ్‌లో సూర్యకుమార్ మినహా మిగతా వారంతా తేలిపోయారు. ఒక్కరంటే ఒక్కరు వికెట్ కాపాడుకునే ప్రయత్నం కూడా చేయలేదు. దాంతో నమీబియాతో మ్యాచ్‌లో బ్యాటింగ్ వీరులందరూ గాడిలో పడాలని మేనేజ్‌మెంట్ కోరుకుంటోంది. ఏమాత్రం తేడా వచ్చినా రాబోయే మ్యాచ్‌కు ఆత్మవిశ్వాసం దెబ్బతింటుందని భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో నమీబియా బౌలింగ్‌ను చితక్కొట్టి తొలిసారి మూడొందల మార్క్‌ను అందుకోవాలని టీమిండియా ప్రణాళికలు వేస్తోంది. ఇది ఎంతవరకు విజయవంతమవుతోంది చూడాలి.

# ఒమన్ బౌలర్లను వణికించిన షనక, పవన్.. అనామక జట్టుపై శ్రీలంక భారీ స్కోర్




**హైదరాబాద్ పెన్ పవర్:** టీ20 వరల్డ్ కప్‌లో భాగంగా ఒమన్‌తో జరుగుతోన్న మ్యాచులో శ్రీలంక బ్యాటర్లు దుమ్మురేపారు. ముఖ్యంగా శ్రీలంక యంగ్ బ్యాటర్ పవన్ రత్నాయక్, కెప్టెన్ దసునా షనక, వికెట్ కీపర్ కుశాల్ మెండిస్ ఆకాశమే హద్దుగా చెలరేగారు. పవన్ (60), షనక (50), మెండిస్ (61) ముగ్గురు అర్ధ సెంచరీలతో హోరెత్తించడంతో శ్రీలంక 20 ఓవర్లలో 220 పరుగుల భారీ స్కోర్ చేసింది.ఈ మ్యాచులో టాస్ గెలిచిన నమీబియా బౌలింగ్ ఎంచుకుంది. దీంతో మొదట బ్యాటింగ్ చేసిన అతిథ్య శ్రీలంక బ్యాటర్లు అనామక ఒమన్ బౌలర్లపై విశ్వరూపం చూపించారు. ఓపెనర్లు నిశాంక (13), కమిల్ మిశ్రా (8) విఫలమైన.. పవన్ రత్నాయక్, కెప్టెన్ షనక, వికెట్ కీపర్ కుశాల్ మెండిస్ రఫ్ఫాడించారు.

ముగ్గురు హాఫ్ సెంచరీలతో పరుగుల వరద పారించారు. పవన్ 28 బంతుల్లోనే 8 ఫోర్లు, ఒక సిక్స్ బాది 60 పరుగులు.. శనక 20 బంతుల్లో 2 ఫోర్లు, 5 సిక్సర్లు కొట్టి 50 రన్స్ చేశారు. మెండిస్ 75 బంతుల్లో 7 ఫోర్ల సహాయంతో 61 పరుగులు చేసి ఔట్ అయ్యాడు.

చివర్లో కమిందు మెండిస్ (7 బంతుల్లో 19 పరుగులు) మెరుపులు మెరిపించాడు. దీంతో శ్రీలంక నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 225 పరుగుల భారీ స్కోర్ చేసింది. ఒమన్ బౌలర్లలో జితేన్ రామనంది 2 వికెట్లు పడగొట్టాడు. సుఫ్యాన్ మెహమూద్, ఒడెద్రా చెరో వికెట్ తీశారు.



# రుక్మిణి టాలీవుడ్‌కు మరో రష్మిక అవుతుందా?



కన్నడ భామలకు తెలుగులో మంచి క్రేజ్ ఉన్న విషయం తెలిసిందే. -ఛలో- మూవీతో టాలీవుడ్‌లోకి ప్రవేశించిన రష్మిక మందన్న వరుస క్రేజీ ఆఫర్లతో స్టార్ హీరోయిన్ జాబితాలో చేరిపోయింది. తెలుగులో స్టార్ హీరోల సినిమాల్లో నటిస్తూ బ్లాక్ బస్టర్లని సొంతం చేసుకున్న రష్మిక నేషనల్ క్రష్ అనిపించుకుంది. స్వతహాగా కన్నడ అయినా తెలుగు సినిమాలకే అధిక ప్రాధాన్యం ఇవ్వడంతో కన్నడ ప్రేక్షకులు రష్మికపై ఫైర్ అయ్యారు.మాతృ భాషకు సంబంధించిన ఇండస్ట్రీని మరిచిందని కామెంట్‌లు చేశారు. ఆ విమర్శల్ని ఎదుర్కొని ఇప్పుడు వన్ ఆఫ్ ది టాప్ హీరోయిన్‌ల జాబితాలో చేరింది. ఇండియా వైడ్‌గా స్టార్ హీరోయిన్‌గా క్రేజ్‌ని సొంతం చేసుకోవడమే కాకుండా అదే స్థాయిలో పాన్ ఇండియా సినిమాలని దక్కించుకుంటూ యమ బిజీగా గడిపేస్తోంది. 2024లో పుష్ప 2తో పాన్ ఇండియా బ్లాక్‌బస్టర్‌ని సొంతం చేసుకున్న రష్మిక అదే హవాని కొనసాగిస్తూ గత ఏడాది -చావా-,-కుబేర- వంటి హిట్‌లని తన ఖాతాలో వేసుకుంది.ప్రస్తుతం కాక్‌టైల్ 2, లేడీ ఓరియెంటెడ్ మూవీ -మైసా-ల్లో నటిస్తున్న రష్మిక తాజాగా ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ పాన్ వరల్డ్ మూవీలో నటించే ఛాన్స్‌ని దక్కించుకుంది. ఇప్పుడు రష్మిక తరహాలో మరో కన్నడ సోయగం రుక్మీణీ వసంత్ నడుస్తున్నట్టుగా తెలుస్తోంది. తెలుగు సినిమాల్లో రష్మిక పాపులర్ అయినట్టుగానే రుక్మిణి కూడా ప్రయత్నాలు చేస్తున్నట్టుగా తెలుస్తోంది. రుక్మీణీ వసంత్..కన్నడ నాట మారుమ్రోగుతున్న పేరిది. ప్రస్తుతం టాలీవుడ్‌లోనూ ఈ పేరు ప్రధానంగా వినిపిస్తోంది. కాంతార ప్రీక్వెల్ -కాంతార: చాప్టర్ 1తో భారీ క్రేజ్‌ని సొంతం చేసుకున్న రుక్మిణి ఈ సినిమాతో తెలుగు మేకర్స్ దృష్టిని ఆకర్షించింది. రెండేళ్ల క్రితమే నిఖిల్ తో -అప్పుడో ఇప్పుడో ఎప్పుడో- మూవీ చేసింది. సుధీర్ వర్మ డైరెక్ట్ చేసిన ఈ సినిమా టైటిల్‌కు తగ్గట్టే ఎప్పుడొచ్చిందో ఎప్పుడు వెళ్లిందో తెలియకుండానే వెళ్లిపోయింది. దీంతో రుక్మిణి టాలీవుడ్ ఎంట్రీ గురించి పెద్దగా ఎవరికీ తెలియలేదు. -కాంతార:చాప్టర్ 1- తరువాతే టాలీవుడ్ మేకర్ల దృష్టి తనపై పడింది. ప్రస్తుతం రుక్మిణి మాస్ ఆఫ్ యాక్షన్ ఎన్టీఆర్ నటిస్తున్న భారీ యాక్షన్ మూవీ -డ్రాగన్-లో నటిస్తోంది.దీన్ని భారీ స్కేల్ లో రిలీజ్ చేయాలని దర్శకుడు ప్రశాంత్ నీల్ ప్లాన్ చేస్తున్నాడు. తెలుగు సినిమాలకు పాన్ ఇండియా రేంజ్‌లో మంచి మార్కెట్ ఉన్న నేపథ్యంలో రష్మిక మందన్న తరహాలోనే రుక్మిణి కూడా టాలీవుడ్‌కే ప్రాధాన్యతనిస్తుందా? ..లేక కన్నడలోనూ నటిస్తూ రెండు భాషల్లోనూ పాపులారిటీని దక్కించుకోవాలని భావిస్తుందా? అన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.



Printed By Published By Gantyada Apparao On Behalf Of Gantyada Apparao, Printed At Sri Sai Ganga Printers And Publishers Flat No : 504, Bharat Towers, 5th Lane Dwarakanagar, Visakhapatnam, Andhra Pradesh - 530016, And Published At 4-79, Revenue Colony, Tammireddy Palem, Kottapeta Editor : Gantyada Apparao. PRGI Registration No. "APTEL/25/A3664 , e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965